Follow: @ANNTELUGU

18-11-2024

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 305 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బాహుబలి గేటు తొలగింపు

### .. తెలంగాణ సెక్రటేరియట్ వాస్తులో మార్పులు

**హైదరాబాద్, మహా :** వాస్తు మార్పులో భాగంగా తెలంగాణ సెక్రటేరియట్ బాహుబలి మెయిన్ ఎంట్రన్స్ గేట్లను ప్రభుత్వం తొలగించింది. గేట్లను తొలగించిన చోట పూర్తిగా గ్రిల్స్ ఏర్పాటు చేయనుంది. హుస్సేన్ సాగర్ వైపు 3వ గేటు దగ్గర తొలగించిన గేటును పెట్టబోతోంది. దాదాపు 6 నెలల నుంచి మెయిన్ ఎంట్రన్స్ గేట్లకు తాళాలు వేసింది సర్కార్. వాస్తు ప్రకారం రాష్ట్ర సచివాలయంలో పలు మార్పులు చేయాలంటూ రేవంత్ సర్కార్ గతంలోనే నిర్ణయం తీసుకుంది. తూర్పు దిశగా ఉన్న సచివాలయం ప్రధాన మహా ద్వారం ఈశాన్యం వైపునకు మారబోతోంది. దీంతో పాటు ప్రస్తుతం సచివాలయంలోని ఆగ్నేయం వైపు ఉన్న గేటు నెంబర్ 2 నుంచి ఎన్టీఆర్ గార్డెన్ వైపున్న గేటు నెంబర్ 4 వైపునకు నేరుగా వెళ్లేలా రహదారిని నిర్మిస్తున్నారు. సచివాలయంలో ప్రధాన ద్వారానికి ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చేస్తోంది రేవంత్ ప్రభుత్వం.

వివరాలు 3లో

పొలిటికల్

## వాస్తవాలు చెప్పేందుకే వరంగల్ సభ



- యూట్యూబ్‌లతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- మంత్రి సీతక్క ఫైర్

02

వైరల్

## మహానటి పెళ్లి?



- కీర్తి సురేష్ మ్యారేజంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- గతంలో ఇలాంటి వార్తలను ఖండించిన హీరోయిన్

03

ఎలక్షన్

## గుజరాత్ పాలన వల్లే ఉద్యోగాలు లేవు



- ఉద్యోగ ప్రాజెక్టులు తరలించారు
- ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ

02

## పొలిటికల్ బాంబులు



### కిషన్ రెడ్డి బీఆర్ఎస్ ప్రొటెక్టర్

- ఆ పార్టీ గ్రాఫ్ పడిన ప్రతిసారి సాయంగా వస్తాడు
- ఫొటోషూట్ కోసమే మూసీ నిద్ర
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్

02



### తెలంగాణలో ఆర్కే బ్రదర్స్ పాలన

- ఏకే ఫ్యామిలీ సంబంధాలు నిరూపిస్తా
- నిరూపించకుంటే రాజకీయాల నుండి తప్పుకుంటా
- కేటీఆర్ అరెస్ట్ కాకుండా ఢిల్లీలో సెటిల్మెంట్
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్


03



### బీఆర్ఎస్ నేతలకు పిచ్చిపట్టింది

- సైక్రియాట్రిస్ట్‌లకు చూపించుకోవాలి
- దుష్టపాలన అంతమై ఏడాది
- మంత్రి కొండా సురేఖ ఫైర్

03




# మహా సంగ్రామం

## ప్రచారానికి నేటితో తెర

### సీఎం రేవంత్‌తో సహా కాంగ్రెస్, బీజేపీ నేతల జోరు ప్రచారం

ఇన్‌ఛార్జిలుగా పనిచేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఆరు పార్టీలు.. రెండు కూటములు..

ఫలితాలు వచ్చాక.. ఎవరు ఎవరితో ఉంటారో చెప్పలేని స్థితి

ఆరు ప్రాంతాల్లో.. అనేక అంశాలు.. అంతుచిక్కని పరిణామాలు

చిన్న పార్టీలకు కూడా.. 20కి పైగా స్థానాలు దక్కే అవకాశం

వివరాలు 2లో

మరాఠా రాజకీయం రూటే సపరేటు. అక్కడి ఓటరు నాడిని పట్టుకోవడం తలపండిన పొలిటికల్ పండితులకు కూడా అంతుచిక్కని విషయం. మహా ప్రచారం క్లైమాక్స్ కు చేరగా, సోమవారం సాయంత్రంతో ప్రచారం పరిసమాప్తం కానుంది. ఇక్కడ వేర్వేరు ప్రాంతాలు.. వేర్వేరు సమూహాలు.. ప్రభావం చూపించే అంశాలు ఎన్నో. అలాగే రాజకీయ పార్టీలు రాష్ట్రమంతా ప్రభావం చూపే పరిస్థితి ఉండదు. అందుకే అక్కడ ఎప్పుడు చూసినా విభిన్న రాజకీయం. ఆరు పార్టీలు. ఆరు ప్రాంతాలు. సిక్సర్ లో మెజారిటీ ఫిక్సర్ ఎవరో తేలిపోనుంది. బుధవారం ఓటరు తీర్పునివ్వనుండగా, 23న ఫలితం తేలనుంది. మహారాష్ట్ర ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ నేతలు పాల్గొన్నారు. తెలంగాణకు సరిహద్దు ప్రాంతం కావడం, ఏపి తరహాలోనే సంబంధ బాంధవ్యాలు ఉండడంతో మహా రాజకీయాల్లో, ప్రచారంలో మనోళ్ళ జోరు కొనసాగింది.

- హైదరాబాద్, మహా




# కమలం రేస్

### కీలక నేతల గురి.. ముందు వరుసలో ఈటల

తనకు ఇచ్చే అవకాశం లేదంటున్న బండి

ఎంపీలకే ఛాన్స్.. గట్టి ప్రయత్నాల్లో రఘునందన్, అర్వింద్

కరీంనగర్, హైదరాబాద్ కే పార్టీని పరిమితం చేస్తారా?

బహిరంగంగా మాట్లాడుతున్న నేతలు

డీకే అరుణకు ఇవ్వాలంటూ మరికొందరి డిమాండ్లు

తమకు అవకాశం ఇవ్వాలంటున్న నలుగురు ఎమ్మెల్యేలు

పదవుల్లేని వారికి ఇవ్వాలంటూ ఎన్ఆర్ఆర్ పేరు తెరపైకి

హాట్ హాట్‌గా బిజెపి పాలిటిక్స్



**హైదరాబాద్, మహా:** భారతీయ జనతాపార్టీలో.. అధ్యక్షపదవిపై పీఠముడి వీడడం లేదు. రాష్ట్ర రథసారధి ఎవరో తేలడం లేదు. అసెంబ్లీ ఎన్నికలు అయిపోయాయి. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. మంత్రి పదవుల పంపకాలు కూడా జరిగిపోయాయి. ఇక పార్టీ పదవుల్లో పంపకాలే మిగిలి ఉన్నాయి. దాంతో బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలైంది.

మిగతా 2లో

# కాలుష్యానికి చెక్

- అమల్లోకి కొత్త ఈవీ పాలసీ.. మంత్రి పొన్నం ప్రభాకర్
- డిసెంబరు 26 వరకు అమల్లో ఉండనున్న కొత్త పాలసీ
- ఎలక్ట్రిక్ వాహనాలపై అపోహలు వద్దన్న మంత్రి




**హైదరాబాద్, మహా :** రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి కొత్త ఈవీ పాలసీ వస్తోందని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జీవో 41 ద్వారా ఈ ఈవీ పాలసీని తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ పాలసీ 2026 వరకు ఉంటుందని స్పష్టం చేశారు. దిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో కాలుష్యం రాకుండా ఉండేందుకే ఈవీ పాలసీని తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

మిగతా 2లో

## ఎన్నికల ప్రచారంలో నవనీత్ కౌర్‌పై దాడి



**ముంబయి, మహా:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియనుండగా, రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేశాయి.

మిగతా 2లో

## ప్రశాంతంగా మొదటిరోజు ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు
- అనుమతించని అధికారులు.. నేడు కూడా పేపర్ - 3 పరీక్ష

**తెలంగాణ, మహా :** రాష్ట్రంలో మొదటి రోజు నిర్వహించిన గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొదటి రోజు రెండు పేపర్లకు పరీక్ష నిర్వహించారు. రేపు ఉదయం 10 గంటల నుంచి మ. 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష జరగనున్నది.

మిగతా 3లో



భార్య గ్రూప్ 3 ఎగ్జామ్ రాస్తుంటే ఎగ్జామ్ సెంటర్ బైట 10 నెలల బిడ్డతో భర్త

## మణిపూర్‌లో కర్ఫ్యూ.. ఇంటర్నెట్ బంద్

### సీఎం బీరేన్ సింగ్ ఇంటిపై దాడి

**మణిపూర్,మహా:** మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. కొందరు రాజకీయ నాయకుల ఇళ్లపై ఆందోళనకారులు దాడులు చేయడానికి యత్నిస్తున్నారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీజేపీ నేతల ఇళ్లపై ఇప్పటికే వారు దాడులకు పాల్పడ్డారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వ్యక్తిగత నివాసంపై కూడా ఆందోళనకారులు దాడులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మిగతా 2లో



# కమలం రేస్

(మొదటి పేజీ తరువాయి)

కొత్త అధ్యక్షుడిని నియమించే కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాషాయ దళపతి అయ్యేందుకు నలుగురు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఎనిమిది మంది నేతలు ఆశిస్తున్నారు. తనకు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే పార్టీని పవర్ లోకి తెస్తానంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. ఆ నలుగురిలో తెలంగాణ బీజేపీకి అధ్యక్షుడయ్యేదెవరు? ఇంతకూ అవకాశం ఎవరికి? ప్రశ్నించే గొంతులకా.. పార్టీలో ఉన్న సీనియర్ కా? ఆర్ఎస్ ఎస్ నేపథ్యానికా.. రాజకీయ చాణక్యానికా? అంతా సస్పెన్స్. పోటీ మాత్రం మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ కంటే నూతన అధ్యక్షుడిని ప్రకటించాల్సి ఉండగా, ఇప్పటికీ తేల్చుకోలేకపోతోంది.

**రోజుకొకరు**

బీజేపీలో అధ్యక్ష పదవి హాట్ హాట్ గా మారింది. బిజెపి పగ్గాలు ఎవరికి? ఈటల రాజేందరా..? రఘునందనా? ధర్మపురి అర్వింందా? లక్ష్మణా? డికె అరుణా? ఎవరికి దక్కబోతుంది. రోజుకొక పేరు తెరమీదకు వస్తుండటంతో ఢిల్లీ పెద్దలు ఎవరికి పగ్గాలు అప్పజెపుతారన్నది అంతుపట్టడం లేదు. ఇంతకీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై అంత చర్చ ఎందుకు?.. అధ్యక్ష పదవికి పార్టీలో కొత్తగా చేరిన నేతలు పనికి రారా..? పాత నేతలే ఉండాలనే రూల్ ఉందా..? అందుకు బండి సంజయ్, కిషన్ రెడ్డిలే నిదర్శనమా..? బిజెపిలో ఇదే చర్చ జరుగుతోంది.

జాతీయ స్థాయిలో మోడీ, అమిత్ షా వర్సెస్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, నితిన్ గడ్కరీల మధ్య బీజేపీలో గ్రూప్ వార్ నడుస్తోందనే ప్రచారాలున్నాయి. పాత నేతలైన కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చి, మిగతా పార్లమెంట్ సభ్యులకు మొండి చేయి చూపించడమే ముందునుండీ ఉన్న నేతలకు ప్రాధాన్యమిస్తారన్న సంకేతమని చెబుతున్నారు.

**బండి నుండి మొదలు**

బండి బిజెపి చీఫ్ గా మారాకే.. బిజెపి గ్రాఫ్ఛేంజ్ అయింది. బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ గా పనిచేసి.. ఇప్పుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతోన్న బండి సంజయ్ కు మరోసారి పార్టీ అధ్యక్ష పగ్గాలు దక్కుతాయనే టాక్ వినిపిస్తోంది. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాక పార్టీలో జోష్ వచ్చిందనేది అందరూ అంగీకరించే అంశం. ఆయన ఆధ్వర్యంలోనే దుబ్బాక, హుజురాబాద్ బైపోల్ లో విజయంతో పాటు గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మీద గట్టిగా పోరాడిన నేతగా సంజయ్ కు క్యాడర్లో గుర్తింపు ఉంది. ఇప్పుడు మళ్లీ గ్రేటర్ ఎన్నికలు వస్తుండటంతో పాటు పార్టీ అధికారంలోకి వచ్చేంత పటిష్టం కావాలంటే సంజయ్ ను అధ్యక్షుడిని చేస్తేనే బాగుంటుందన్న అభిప్రాయాలున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు సడెన్ గా ఆయనను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడంతో బీజేపీ క్యాడర్ నిరుత్సాహానికి గురైంది. కట్టర్ బీజేపీ నేతగా.. మాస్ లీడర్ గా సంజయ్ కు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. అందుకే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను తప్పించడం వల్ల జరిగిన డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకోవాలంటే తిరిగి మళ్లీ సంజయ్ నే ప్రెసిడెంట్ చేయాలన్న వాదన వినిపిస్తోంది. అయితే తాను రేసులో లేనని, కేంద్ర మంత్రిగా ఉన్న తనకు అధ్యక్షపదవి రాదని బండి సంజయ్ ఆదివారం తేల్చి చెప్పారు.

**రేసులో రామచంద్రరావు**

బీజేపీ సీనియర్ లీడర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రావు కూడా పార్టీ అధ్యక్ష రేసులో ఉన్నారు. ఆయన పార్టీలో మొదటినుండి ఉన్న సీనియర్ నేత. గ్రేటర్ బీజేపీ ప్రెసిడెంట్ గానూ పనిచేసిన అనుభవం ఉంది. ఒకవేళ ఆయనకు పార్టీ ప్రెసిడెంట్ పగ్గాలు అప్పగిస్తే..ఎలా ఉంటుందని కూడా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా కాషాయ దళపతి రేసులో ఉన్నట్లు టాక్ నడుస్తోంది.

**బిజెపిలో ఫైర్ బ్రాండ్ అర్వింద్**

బిజెపిలో ధర్మపురి అర్వింద్ ఫైర్ బ్రాండ్. పట్టులేని ప్రాంతంలో బిజెపికి మూడు అసెంబ్లీ సీట్లు, ఎంపీ సాధించడంలో ఆయన పోరాట పటిమ , రాజకీయ నేర్పరితనం స్పష్టం. కేంద్రమంత్రి పదవి ఆశించినా ఆయనకు దక్కలేదు. ఇపుడు రాష్ట్ర అధ్యక్షపదవిని ఆయన బలంగా కోరుకుంటున్నారు. ధర్మపురికి ఛాన్స్ చిక్కితే రాజకీయం మరో రూపం సంతరించుకుంటుంది.

**ఎమ్మెల్యేలు కూడా..**

ఎంపీలకు కేంద్ర మంత్రి పదవులు ఉన్నందున ఎమ్మెల్యేలలో ఒకరికి ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. వెంకటరమణారెడ్డి, రాజాసింగ్, పాయల్ శంకర్ తదితరులు పదవిని ఆశిస్తున్నారు. ఆశావహులు ఎక్కువగా ఉండటంతో..సామాజిక సమీకరణాలు.. రాజకీయ పరిస్థితులపై అధిష్టానం లెక్కలు వేసుకుంటున్నది. అయితే ఆలస్యం చేయకుండా ప్రక్రియపూర్తిచేయాలని నేతలు కోరుకుంటున్నారు.

### ఈటలకు పగ్గాలు ఇస్తే

ఇక మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బండి సంజయ్ ని అధ్యక్షుడిగా తప్పించి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చే సమయంలోనే ఈటల చీఫ్ అవుతారని చర్చ జరిగింది. కానీ ఆయనకు బాధ్యతలు ఇవ్వలేదు. అయితే ఈటల రాజేందర్ ని పార్టీ ప్రెసిడెంట్ చేస్తే బీసీకి అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని పార్టీ భావిస్తున్నట్లు వినడుతోంది. ఈటలకు మంత్రి పదవి ఇవ్వకుండా ఖాళీగా ఉంచడం వెనుక వ్యూహం ఇదేనంటున్నారు.


### ప్రశ్నించే గొంతుగా రఘునందన్

మెదక్ ఎంపీ రఘునందన్ రావు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ఢీ అంటే ఢీ అంటున్నారు. బిజెపి అధికారంలోకి రావాలంటే హైదరాబాద్, కరీంనగర్ కాకుండా వేరే జిల్లాలకు పార్టీ పగ్గాలు ఇవ్వాలని , పోరాడే వారికి బాధ్యతలు ఇవ్వాలని అంటున్నారు. బీజేపీలో పుట్టి పెరిగిన నేత కాకపోయినా..ఆ పార్టీలో చేరగానే.. సిద్ధాంతాలను ఆకళింపుచేసుకుని, ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చిన నేతలా పార్టీ కోసం గళం వినిపిస్తుంటారు. అంతేకాదు ప్రశ్నించే గొంతుగా రఘునందన్ కు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దుబ్బాకలో ఓడినా పట్టుబట్టి మెదక్ ఎంపీ టికెట్ తెచ్చుకుని గెలిచి సత్తా చాటారు. ఇప్పుడు అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే.. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు.

## గుజరాత్ పాలన వల్లే మహారాష్ట్రలో ఉద్యోగాలు లేవు

ఉద్యోగ ప్రాజెక్టులు తరలించారు

ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ



**ముంబై, మహా:** మహారాష్ట్రలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడం వల్లే మహారాష్ట్ర యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయని ఆమె ఆరోపించారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, కొత్త విషయాలను నేర్చుకుంటున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం వారికి సరైన ఉద్యోగావకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో మహాయుతి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని దుయ్యబట్టారు.

మహారాష్ట్రలో ఉన్న సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి మహాయుతి నాయకులు 'లడ్కీ బహిన్' వంటి పథకాలను తెరమీదకు తీసుకువస్తున్నారని ప్రియాంక ఆరోపించారు. ఇకనైనా ప్రజలు వారి మాయ మాటలను నమ్మకుండా అభివృద్ధి గురించి ఆలోచించాలని, ముఖ్యంగా మహిళలు డబ్బు కోసం కాకుండా మెరుగైన జీవితం కోసం ఓటు వేయాలని ప్రియాంక పిలుపునిచ్చారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) అధికారంలోకి వస్తే, సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ.7,000 కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఐక్యంగా ఉంటే భద్రంగా ఉండొచ్చని బీజేపీ చేస్తున్న నినాదాలు పేద ప్రజల కోసం కాదని, పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్న వారి మిత్రులు ఐక్యంగా ఉండాలని ఆయన సూచిస్తున్నారని ప్రియాంక అన్నారు. ఆ పార్టీ ఎవరి అభివృద్ధి గురించి కృషి చేస్తున్నారో దేశం మొత్తానికి తెలుసని పేర్కొన్నారు.

## వాస్తవాలు చెప్పేందుకే వరంగల్ సభ

యూట్యూబ్‌లతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

మంత్రి సీతక్క ఫైర్



**మహా, వరంగల్ :** బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి రాజకీయ లబ్ధి తప్ప వేరే ఆలోచన లేదని.. అందుకే అధికారులపై దాడులు చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. తాము మంచి పనులు చేస్తే బీఆర్ఎస్ అడ్డుకుంటోందని చెప్పారు. హైడ్రాకు అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. మీరు చేసిన సకల జనుల సర్వే ఏమైందని ప్రశ్నించారు. లిమ్కా బుక్ రికార్డు కోసమే బీఆర్ఎస్ సకల జనుల సర్వే చేసిందని ఎద్దేవా చేశారు. కానీ తాము చేసే కులగణన ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించడానికేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకే మూటలు ఇచ్చిన చరిత్ర ఉందని సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని మంత్రి సీతక్క ఆరోపించారు. తమకు మూటలు మోసే అలవాటు లేదని తేల్చిచెప్పారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను మెచ్చుకున్నారని.. ఇప్పుడు తిడుతున్నారని చెప్పారు. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకే వరంగల్ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రగతి సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలకు సంబంధించిన అంశాలను ప్రగతి నివేదికలో వివరిస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సులు కూడా మహిళలే నిర్వహించేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు అమలు చేశామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## దమ్ముంటే.. చర్చకు రండి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం సవాల్



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డైరెక్షన్ మేరకు కిషన్ రెడ్డి మూసీ నిద్ర చేపట్టారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. కిషన్ రెడ్డి ముందు మీ మొద్దు నిద్ర వీడండి అని ఆయన అన్నారు. కేంద్రం నుండి ఒక్క రూపాయి తీసుకొచ్చే శక్తి లేదు మీకు అని ధ్వజమెత్తారు. మూసీ కాలువ వాసన చూసిన తర్వాత అయినా దైవ సాక్షిగా వాస్తవాలు చెప్పాలన్నారు. "కిషన్ రెడ్డి.. మీరసలు తెలంగాణ బిడ్డేనా? డిఎన్ ఏ పరీక్ష చేసుకోండి.. తెలంగాణ బిల్లు ఎలా పాస్ అయిందో మీకు తెలియదా? కలెక్టర్ ను కొట్టిన వారిని సమర్థించిన మీరు కేంద్ర మంత్రిగా అర్హులా? కొట్టినోళ్లను, కొట్టిచ్చినోళ్లను వదిలే ప్రసక్తే లేదు.ఐఎఎస్ పై దాడి జరిగితే ఖండించకపోగా సమర్థించడం దారుణం. ఆయన వైఖరి బాధాకరం. అసలు బీజేపీ స్టాండ్ ఏంటి? ఎంపీగా ప్రజలకు మీరేం చేశారో, నేనేం చేశానో.. దమ్ముంటే బహిరంగ చర్చకు రండి" అని పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

## మణిపూర్‌లో కర్ఫ్యూ..ఇంటర్నెట్ బంద్

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా బలగాలు, నిరసనకారులకు మధ్య ఘర్షణ తలెత్తింది. మైతేయీ‌కుకీ తెగల మధ్య తరుచూ అల్లర్లు చెలరేగుతుండడంతో మణిపూర్‌లో కొన్ని నెలలుగా ప్రతికూల పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం ముగ్గురు మైతేయీల మృతదేహాలు జిరి నదిలో కనపడడంతో ఈ నిరసనలు జరుగుతున్నాయి. తాజాగా మరో ముగ్గురి మృతదేహాలు కనపడడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఇంఫాల్ లోయలోని పలు జిల్లాల్లో అధికారులు నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ప్రభుత్వం భారీగా భద్రతా చర్యలను తీసుకుంటోంది. ఆదివారం ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు శాసనసభ్యుల ఇళ్లను నిరసనకారులు ధ్వంసం చేశారు. లోయ అంతటా హింసాత్మక నిరసనలు కొనసాగుతుండటంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నాయి.

# మహా సంగ్రామం

**హైదరాబాద్, మహా :** మరాఠా రాజకీయం రూటే సపరేటు. అక్కడి ఓటరు నాడిని పట్టుకోవడం తలపండిన పొలిటికల్ పండితులకు కూడా అంతుచిక్కని విషయం. మహా ప్రచారం క్లైమాక్స్ కు చేరగా, సోమవారం సాయంత్రంతో ప్రచారం పరిసమాప్తం కానుంది. ఇక్కడ వేర్వేరు ప్రాంతాలు.. వేర్వేరు సమూహాలు.. ప్రభావం చూపించే అంశాలు ఎన్నో. అలాగే రాజకీయ పార్టీలు రాష్ట్రమంతా ప్రభావం చూపే పరిస్థితి ఉండదు. అందుకే అక్కడ ఎప్పుడు చూసినా విభిన్న రాజకీయం. ఆరు పార్టీలు. ఆరు ప్రాంతాలు. సిక్సర్ లో మెజారిటీ ఫిక్సర్ ఎవరో తేలిపోనుంది. బుధవారం ఓటరు తీర్పునివ్వనుండగా, 23న ఫలితం తేలనుంది. మహారాష్ట్ర ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ నేతలు పాల్గొన్నారు. తెలంగాణకు సరిహద్దు ప్రాంతం కావడం, ఎపి తరహాలోనే సంబంధ బాంధవ్యాలు ఉండడంతో మహా రాజకీయాల్లో, ప్రచారంలో మనోళ్ళ జోరు కొనసాగింది.

**మరాఠీ vs గుజరాతీ**

మహారాష్ట్ర ఎన్నికల్లో ఇపుడు మరాఠీ vs గుజరాతీ ఫ్యాక్టర్ హాట్ టాపిక్ గా మారింది. వలసదారులు మహారాష్ట్ర జనాభాలో ఎనిమిది శాతం ఉన్నారు. మొదటి ఐదు రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్. ముంబైలో, వలసదారులు జనాభాలో 43 శాతం ఉన్నారు. ముంబై జనాభాలో మహారాష్ట్రీయులు దాదాపు 42 శాతం, గుజరాతీలు 19 శాతం ఉన్నారని డేటా చూపిస్తుంది. ఉద్ధవ్ ఠాక్రే మరియు శరద్ పవార్ మరాఠీ ఆత్మగౌరవ యాంగిల్‌ను ప్లే చేస్తున్నారు. మరాఠీ పార్టీలను విచ్ఛిన్నం చేసి అక్రమంగా అధికారాన్ని ఆక్రమించుకున్నందుకు బిజెపిని నిందించారు. ఫాక్స్‌కాన్, వేదాంత మొదలైన కొన్ని ప్రాజెక్ట్‌లు మహారాష్ట్ర నుండి గుజరాత్‌కి మారిన వాస్తవం మరాఠీ వర్సెస్ గుజరాతీ యుద్ధంగా మార్చడానికి వారికి మందుగుండు సామగ్రిని అందించింది, ప్రతీకారం తీర్చుకోవాలని మరాఠీ యువతను ప్రోత్సహిస్తుంది. గుజరాతీలు అనేక వ్యాపారాలను నియంత్రిస్తారు . బాగా సంపన్నులు. నరేంద్ర మోడీ అగ్రస్థానంలో చేరడంతో ముంబైలో గుజరాతీ జాతీయవాదానికి దారితీసింది.ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో ఈ పోరాటానికి మూలాలు ఉన్నాయి. ముంబై మెట్రోపాలిటన్ ఏరియాలోని పట్టణ కేంద్రాల్లో ఇది ఎక్కువగా ప్రతిధ్వనించినప్పటికీ, వలస జనాభా తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఇది పని చేయకపోవచ్చు. బిజెపికి గుజరాతీలు మరియు ఉత్తర భారతీయుల మద్దతు లభిస్తుందని, ఉద్ధవ్ శివ సేన మరియు కాంగ్రెస్ ముంబైలో మరాఠీల మద్దతును పొందుతున్నాయని నమ్ముతారు.

**బాబాయ్ వర్సెస్ అబ్బాయి**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎన్నడూ లేనంతగా ఈసారి ఉత్కంఠ రేపుతున్నాయి. శివసేన, ఎన్సీపీ వంటి ప్రధాన పార్టీలు అంతర్గత కలహాలతో రెండుగా చీలిపోవడం అందుకు ప్రధాన కారణం. మరీ ముఖ్యంగా ఎన్సీపీ చీలిపోయిన తర్వాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు కావడం వల్ల అందరిలో ఆసక్తి నెలకొంది. పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతిసహా 35స్థానాల్లో బాబాయి, అబ్బాయి వర్గాలు తలపడుతున్నాయి. పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతి నియోజకవర్గం ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడి నుంచి శరద్ పవార్, ఆ తర్వాత అజిత్ పవార్ దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1967లో తొలిసారి బారామతి అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికైన శరద్ పవార్ 1990 వరకు ప్రాతినిధ్యం వహించారు. 1991 ఉప ఎన్నిక నుంచి 2019 వరకు అజిత్ పవార్ గెలిచారు. దాదాపు 6 దశాబ్దాల నుంచి పవార్ కుటుంబం కంచుకోటగా ఉన్న బారామతి స్థానంలో ఈసారి ఇరువర్గాలు అమీతుమీకి సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న అజిత్ పవార్ మరోసారి బరిలో నిలిచారు. వరుసగా ఏడుసార్లు గెలిచిన అజిత్ ఈసారి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఎన్సీపీ (ఎస్పీ) తరఫున యుగేంద్ర పవార్ బరిలో నిలిచారు. అజిత్ పవార్ సోదరుడు శ్రీనివాస్ కుమారుడు యుగేంద్ర. విదర్భలోని తుమ్సర్, అహేరి, పుసాద్, ముంబయి, పుణె, కొల్హాపూర్ తదితర స్థానాల్లో నేరుగా తలపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలోనూ ఇరువర్గాల వ్యూహాలు భిన్నంగా ఉన్నాయి. ఎన్సీపీ సంప్రదాయ విలువలపై శరద్ పవార్ వర్గం దృష్టి సారించింది. సామాజిక సంక్షేమం, అభివృద్ధి తదితర వాగ్దానాలతో గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. అజిత్ పవార్ వర్గం మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ ప్రాజెక్టులకు ప్రచారంలో ప్రాధాన్యం ఇస్తోంది. అర్బన్, సెమీ అర్బన్ ఓటర్లపై అజిత్ వర్గం దృష్టి కేంద్రీకరించింది.

### తెలుగోళ్ళ ఎఫెక్ట్

మరాఠీ గడ్డపై దాదాపు 14 లక్షల మంది తెలుగువాళ్లున్నారని ఒక అంచనా ఉంది. పైగా.. మహారాష్ట్రలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వలసల కార్మికుల్లో ఎక్కువమంది తెలుగువారే. ముఖ్యంగా పూణే, ముంబై సహా మరికొన్ని పట్టణాల్లో తెలుగువారి సంఖ్య భారీగానే ఉంది. షిరిడీలో స్థిరపడ్డవారిలో తెలుగు మూలాలున్నవాళ్లు ఎక్కువ. తెలంగాణకు పొరుగు రాష్ట్రం కావడం.. గతంలో హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ప్రాంతం కావడం.. టాలీవుడ్‌కి, బాలీవుడ్‌కీ దగ్గరి అనుబంధం కలిగి ఉండడం.. తెలుగు, మరాఠీ సంస్కృతుల్లో పోలిక ఉండడం.. ఇవన్నీ మహారాష్ట్ర ఎన్నికల్లో తెలుగు ప్రభావాన్ని పెంచే అంశాలే.

## కాలుష్యానికి చెక్

(మొదటి పేజీ తరువాయి)

టూ వీలర్స్, ఆటో, ట్రాన్స్‌పోర్ట్, బస్సులకు వంద శాతం పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు కూడా మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. జంట నగరాల్లో ఈవీ బస్సులను తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈవీ వాహనాల వల్ల వినియోగదారులకు ఏడాదికి సుమారు రూ.లక్ష మిగులుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రజలు విద్యుత్ వాహనాల కొనుగోళ్లపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఆయన కొత్త ఈవీ పాలసీపై మాట్లాడారు.

రవాణాశాఖ పరంగా మార్పులు చేర్పులు తీసుకొచ్చి ప్రజల్లో చైతన్య తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్య నగరంగా మారకుండా ఉండేందుకు ఈవి పాలసీ తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలకు పరిమితి లేదని, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మార్చాలని ప్రణాళికలు తెచ్చామన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు కొన్నట్లైతే , కార్లు ఆర్టీసీ బస్సులు , సంస్థల బస్సులు 100 టాక్స్ మినహాయింపు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో 83 పటాన్ చేరువులో 72 కాలుష్యం ఉంది. కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవి పై పూర్తి స్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లో ఇప్పుడున్న మూడు వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సిఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. త్వరలోనే సిటీ లో మొత్తం ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. తెలంగాణ మొత్తం ఈవి పాలసీ ఉంటుందని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల కారణంగా దేశంలో లక్ష 50 వేల మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతుంటే తెలంగాణ లో రోజుకు 20 మంది చనిపోతున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు వంద వాహనాలు కొత్త రిజిస్ట్రేషన్లు అవుతుంటే అందులో అయిదు ఎలక్ట్రిక్ వాహనాలుంటున్నాయని మంత్రి వివరించారు.

### ఎన్నికల ప్రచారంలో నవనీత్ కౌర్‌పై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేత, మాజీ ఎంపీ నవనీత్ రాణాపై పలువురు వ్యక్తులు దాడికి తెగబడ్డారు. అమరావతిలో దరియాపూర్ సమీపంలోని ఖల్లార్ గ్రామంలో ఆదివారం ఈ దాడి ఘటన చోటు చేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అభ్యర్థికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నవనీత్ రాణా ప్రసంగిస్తున్న సమయంలో పలువురు వ్యక్తులు ఆమె ప్రసంగానికి అడ్డు పడే ప్రయత్నం చేశారు. ఆమె అవేమీ పట్టించుకోకుండా.. తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. అనంతరం సభ వేదికపై నుంచి ఆమె దిగుతున్న సమయంలో.. పలువురు వ్యక్తులు ఆమెతోపాటు వెంట ఉన్న పార్టీ మద్దతుదారులపై కుర్చీలు విసిరారు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేసిన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆమె.. తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## దుష్టపాలనపై అంతమై ఏడాది

- అందుకే వరంగల్ లో మహిళల విజయోత్సవం
- రెండో రాజధానిగా వరంగల్ అడుగులు
- మంత్రి కొండా సురేఖ



**వరంగల్, మహా:** కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పులపాలు చేసిందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆదివారం వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దుష్టపాలన అంతమొందించి ఏడాది పాలన సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లక్ష మంది మహిళలతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధాని కోసం అడుగులు పడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధిపై దృష్టిసారించారని అన్నారు. గతంలో ఇక్కడ నిర్వహించిన రాహుల్ గాంధీ సభ విజయవంతమైందని గుర్తు చేశారు. ఈసభ కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లగచర్ల ఘటన కలెక్టర్‌పై దాడి మాజీ మంత్రి కేటీఆర్ పనే అని ఆరోపించారు. కేటీఆర్ వెనక ఉండే దాడి చేయించారని విమర్శలు చేశారు. అమాయకులను బలి చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అధికారులను విదేశాల్లో దాచారని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది తుగ్లక్ పాలన అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలకు పిచ్చిపట్టిందని.. సైక్రియాటిస్ట్‌కు చూపించుకోవాలని సెటైర్లు గుప్పించారు. కేటీఆర్ విషయంలో నిజాలు తేల్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మమునూరు ఎయిర్ పోర్టుకు మహర్దశ

**రూ. 205 కోట్లు విడుదల**

**రెండు రోజుల్లో పనులు ప్రారంభం**

**వరంగల్ లో రెండవ ఎయిర్ పోర్టు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో మరో కొత్త ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి రానుంది. ఈ దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మామునూరు ఎయిర్ పోర్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే.. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణ కోసం రూ.205 కోట్లను విడుదల చేస్తూ.. ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు కేవలం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మరో ఎయిర్ పోర్ట్ కూడా అందుబాటులోకి రానుంది. రెండవ రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెప్తున్న వరంగల్‌లోనే ఖిల్లా వరంగల్ మండలంలోని మామూనూరు ప్రాంతంలోని ఎయిర్ పోర్ట్ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే కసరత్తు షురూ చేసింది. ఎయిర్ పోర్ట్ విస్తరణకు కావాల్సిన భూసేకరణ కోసం మంత్రుల బృందం ఇటీవలే మామునూరు ప్రాంతంలో పర్యటించింది ఖూడా. అయితే.. విమానాశ్రయ విస్తరణకు మొత్తంగా 253 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ఈ దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

ఎయిర్ పోర్ట్ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణ కోసం రూ.205 కోట్లను విడుదల చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ జీవో జారీ చేసింది. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్లతో కూడిన డీపీఆర్‌ను వేగంగా సిద్ధం చేయాలని ఎయిర్ పోర్ట్ అథారిటీకి ఆర్ అండ్ బీ శాఖ లేఖ కూడా రాసింది. మామునూర్ విమానాశ్రయ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల పరిధి ఒప్పందాన్ని జీఎమ్మార్ సంస్థ విరమించుకుంది. ఇప్పటికే ఎయిర్ పోర్ట్ పరిధిలో 696 ఎకరాల భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కొత్తగా సేకరించే 253 ఎకరాల భూమిని రన్ వే విస్తరణకు, నెవిగేషనల్ ఇన్స్ట్రూమెంట్ ఇన్‌స్టాలేషన్ విభాగాల కోసం నిర్మాణాలకు, ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్), టెర్మినల్ బిల్డింగ్ కోసం వినియోగించనున్నారు.

### మంత్రి కోమటిరెడ్డి చొరవతో..

అయితే.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో మామూనూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో ముందడుగు పడింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనుండగా ఇందులో భాగంగానే మామునూరు విమానాశ్రయ పనులను ఆయన ప్రారంభించనున్నట్లుగా సమాచారం. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలోనే.. వరంగల్ అభివృద్ధిపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే వరంగల్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మామునూరు విమానాశ్రయాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని వేగంగా అడుగులు వేస్తోంది.

## మహానటి పెళ్లి?

**మహా, సినిమా:** మహానటి కీర్తి సురేష్ టాలీవుడ్ లో భారీ పాపులారిటీ సంపాదించుకొని, ఇప్పుడు పెళ్లికి సిద్ధమవుతోందనే వార్త ప్రచారంలో ఉంది. డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోబోతోందని, గోవాలో పెళ్లికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని అభిమానులు ప్రచారం చేస్తున్నారు. కీర్తి సురేష్ వివాహం చేసుకోబోయే వ్యక్తి దగ్గరి బంధువు అని , త్వరలోనే కీర్తి సురేష్ కుటుంబ సభ్యుల నుంచి ఈ విషయం అధికారికంగా వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది. గతంలో పలుమార్లు పెళ్ళి వార్తలను ఖండించిన కీర్తి ఇపుడు కన్ ఫాం చేస్తుందా.. ఏం చెబుతుంది అనేది చూడాలి.

## బాహుబలి గేటు తొలగింపు

**.. తెలంగాణ సెక్రటేరియట్ వాస్తులో మార్పులు**

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగానే ప్రస్తుత ప్రధాన మహా ద్వారాన్ని ఈశాన్యం వైపు మార్చుతుండగా.. ఇకపై ఆ గేటు ద్వారానే సీఎం రేవంత్ రెడ్డి రాకపోకలు సాగించే అవకాశం కనిపిస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జూన్ లోనే సచివాలయ ప్రధాన మహాద్వారాన్ని మూసివేయటంతో పాటు ఆ మార్గం గుండా ఎలాంటి రాకపోకలు జరపడం లేదు. ఆ ద్వారాలు తెరుచుకోకుండా ఇనుప తీగ చుట్టారు. అయితే, ప్రస్తుతం తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారం సచివాలయం నిర్మాణం సమయంలో సూచించిన విధంగా వాస్తు ప్రకారం జరగలేదనే చర్చ ఉంది. ఇక ఈ క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన కొంత కాలానికే ఈ ప్రధాన మహా ద్వారాన్ని మూసివేసింది.

### ప్రశాంతంగా మొదటిరోజు

## ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

కాగా, 1,365 పోస్టులకు గ్రూప్ 3 పరీక్షలను నిర్వహిస్తుంది టీజీపీఎస్సీ. ఈ పరక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5. 36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల సందర్భంగా ఎగ్జామ్ సెంటర్ల వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకుని మొదటి రోజు నిర్వహించిన పరీక్షలను విజయవంతంగా రాశారు. అయితే, పలువురు అభ్యర్థులు ఎగ్జామ్ సెంటర్లకు ఆలస్యంగా రావడంతో వారిని పరీక్షలు రాసేందుకు అనుమతించలేదు. దీంతో వారు కన్నీరుమున్నీరవుతూ వెనుదిరిగారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## కన్నా.. నేనున్నా

**భార్య గ్రూప్ 3 ఎగ్జామ్ రాస్తుంటే ఎగ్జామ్ సెంటర్ బైట 10 నెల బిడ్డను నిద్రపుచ్చుతున్న భర్త**

**కరీంనగర్, మహా :** శంకర్ అనే యువకుడు అకౌంటెంట్ గా జాబ్ చేస్తున్నాడు.. తన భార్య స్వప్న గ్రూపు పరీక్ష రాయడానికి కరీంనగర్లోని స్థానిక సిద్ధార్థ పాఠశాలలో సెంటర్ పడగా.. దగ్గరna ఉన్న ఒక షాపు వద్ద ఉన్న చిన్న గద్దెపై కూర్చొని తమ పది నెలల అబ్బాయిని జోకొట్టి నిద్ర పుచ్చి కనిపించాడు. దీంతో మహిళల కెరీర్ ఎదుగుదలలో భర్త పాత్ర ఎంతో ముఖ్యంగా మారింది అనడానికి నిదర్శనమే ఇది అంటూ నెటిజన్లు అభినందిస్తున్నారు.

### మూసీపై డ్రామాలని అంటే

# రాజకీయాలే మానేస్తా

## ఈటల రాజేందర్ సంచలన ప్రకటన



**అమ్మన్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో అగ్గి రాజేస్తున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళన విషయంలో తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతుండగా ప్రస్తుతం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన కామెంట్లు చర్చకు తెరలేపాయి. అయితే మూసీ ప్రక్షాళన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన సవాలును స్వీకరిస్తూ బీజేపీ ఎంపీలు శనివారం రాత్రి మూసీ బస్తీల్లో నిద్ర చేశారు. ఈ మూసీ నిద్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు కె లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్ తదితర నేతలు మూసీ పరివాహకంలోని మొత్తం 20 ప్రాంతాల్లో నిద్ర చేశారు. కాగా.. ఎల్బీనగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ ఇంట్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిద్రించారు. బీజేపీ నేతలు చేసిన ఈ మూసీ నిద్రపై అధికార కాంగ్రెస్ నేతలు ఘాటు ఆరోపణలు చేశారు. బీజేపీ నేతలవి అన్ని డ్రామాలే అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా కామెంట్లు చేశారు. కాగా.. పొన్నం ప్రభాకర్ చేసిన కామెంట్లపై ఈటల రాజేందర్ ఘాటుగా స్పందించారు. బస్తీ నిద్ర అనంతరం.. స్థానికులతో ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్ట్ విషయంలో బీజేపీ పార్టీవి డ్రామాలే అయితే తాను రాజకీయాలు మానేస్తానని ఈటల సంచలన ప్రకటన చేశారు. బీజేపీవి డ్రామాలే అయితే మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇద్దరం కలిసి పర్యటిద్దామన్న ఈటల అక్కడి ప్రజలు తమవి డ్రామలని అంటే రాజకీయాలు పూర్తిగా మానేస్తానంటూ సంచలన స్టేట్ మెంట్ ఇచ్చారు. ఒకవేళ ప్రభుత్వానివే డ్రామాలని వాళ్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అంటూ పొన్నంతో పాటు ప్రభుత్వ పెద్దలకు ఈటల సవాల్ విసిరారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ధోరణి ఒక్కటేనని ఈటల రాజేందర్ ఆరోపించారు. కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులు పెట్టి కట్టుకున్న నిరుపేదల ఇళ్లను కూలగొడతామంటే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని ప్రభుత్వాన్ని ఈటల హెచ్చరించారు. కూల్చివేతలకు ఎన్ని బుల్డోజర్లు వచ్చినా అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వంలో ఉన్న మంత్రులు మాత్రం తాము డ్రామాలు ఆడుతున్నామంటూ కామెంట్లు చేయటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

### తెలంగాణలో

# ఆర్కే బ్రదర్స్ పాలన

## ఎకె ఫ్యామిలీ సంబంధాలు నిరూపిస్తా

**నిరూపించకుంటే రాజకీయాల నుండి తప్పకుంటా**

**కేటీఆర్ అరెస్ట్ కాకుండా ఢిల్లీలో సెటిల్మెంట్**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్**

**సంగారెడ్డి , మహా:** తెలంగాణలో ఆర్కే బ్రదర్స్ పాలన నడుస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ఢిల్లీలో సెటిల్మెంట్ చేసుకోవడంతో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్ కథ కంచికి పోయింది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసులన్నీ గాలికే పోయాయి. కలెక్టర్‌పై దాడి సూత్రధారి కేటీఆర్ అని తెలినా అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకపోవడం సర్కార్ చేతగానితనమే. కేసీఆర్, రేవంత్ కుటుంబానికి మధ్య వ్యాపార సంబంధాలున్నయి. నేను నిరూపిస్తా.... కేసీఆర్ ఫ్యామిలీ రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా. నాకు, రేవంత్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా'' అని బండి సంజయ్ సవాల్ విసిరారు.



నేను కేంద్రమంత్రినే.. రాష్ట్ర పగ్గాలు నాకు రావు

''రైతుల సమస్యలను పక్కదారి పట్టించేందుకే దాడులు తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్ విధ్వంసకర పార్టీ. దాడులతో ప్రజల ప్రాణాలతో బీఆర్ఎస్ చెలగాటాలాడుతోంది. గ్రూప్ 1, కానిస్టేబుల్ ఆందోళనలోనూ బీఆర్ఎస్ విధ్వంసం చేయాలనుకుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌ను నిషేధించాలి. రాష్ట్ర ప్రజలు వాస్తవాలు ఆలోచించండి. నేను కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నా. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు నాకు అప్పగించే అవకాశాల్లేవు'' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# మహిళలకు శుభవార్త

## జిల్లాల్లో మహిళా శక్తి భవనాలు.. రూ.110 కోట్లు మంజూరు

**22 జిల్లాల్లో భవనాలు నిర్మాణం.. ఒక్కో భవనానికి అయిదు కోట్లు విడుదల**

**ట్విట్టర్ లో జాబితా విడుదల చేసిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, మహా :** మహిళలకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపి కబురు వినిపించింది. రాష్ట్రంలో ఉన్న కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని పదే పదే చెప్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ వారి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) లో ఉన్న మహిళలను ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు రకరకాల అవకాశాలను కల్పించటమే కాకుండా కొన్ని ప్రత్యేక కార్యక్రమాల్లో వారికే ప్రాధాన్యం కూడా ఇస్తోంది. ఈ క్రమంలోనే.. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు.. రాష్ట్రంలోని 22 జిల్లాలో ఈ ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించేందుకు కోసం సర్కార్ పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.5 కోట్ల చొప్పున మొత్తం 22 భవనాలు నిర్మించేందుకు 110 కోట్ల రూపాయలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భవనాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. ఆయా జిల్లాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ భవనాల నుంచే కార్యకలాపాలు సాగించనున్నాయి. అంతేకాకుండా.. ఇందిరా మహిళ శక్తి భవనాలలో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్, కామన్ వర్క్ షెడ్, ఉత్పత్తుల ప్రదర్శన మేళాలు, జీవనోపాధి, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ తదితర కార్యకలాపాలు ఈ ఇందిరా మహిళా శక్తి భవనాలలో నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 19న సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సభలో ఈ ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం. అయితే ఎక్కడెక్కడ ఈ భవనాలు నిర్మిస్తారన్నది మంత్రి సీతక్క తన ట్విట్టర్ అకౌంట్ వేదికగా జాబితా విడుదల చేశారు.

### ఈవీలకు నో రోడ్ ట్యాక్స్,

## నో రిజిస్ట్రేషన్ ఫీ

- సంచలన నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పర్యావరణానికి హాని కలిగించకుండా, వాయు కాలుష్యాన్ని నియంత్రించేలా అడుగు ముందుకేసింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించేలా చర్యలు చేపట్టింది. ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చింది. అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకూ వర్తింపజేసింది. అన్ని రకాల వాహనాలు అంటేటూ వీలర్లు, కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, ఇ ఆటోలు, ట్యాక్సీలు ఇలా ఏ వాహనమైనా సరే అవి ఎలక్ట్రికల్ వెహికల్స్ అయితే చాలు వాటికి రోడ్ ట్యాక్సులు, రిజిస్ట్రేషన్ల ఫీజు నుంచి వంద శాతం మినహాయింపు ఉంటుంది. ఈవీలను కొనుగోలు చేసిన వాళ్లు ఒక్క రూపాయి కూడా రోడ్ ట్యాక్స్ గానీ, రిజిస్ట్రేషన్ ఫీజు గానీ చెల్లించనక్కర్లేదు. వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ట్యాక్సీలు, టూరిస్ట్ క్యాబ్స్, ప్రైవేట్ కార్లకూ ఈ విధానం కిందికి తీసుకొచ్చింది తెలంగాణ ప్రభుత్వం. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, నాన్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే అన్ని ఇ ఆటోలకూ ఈ విధానం వర్తిస్తుంది. ఆయా ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఇకపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర్లేదు.

### కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా

## రికార్డు స్థాయిలో వరి దిగుబడి

**రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇదే తొలిసారి.. సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్**

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించటం వల్లే తెలంగాణలో వరిసాగు పెరిగిందని బీఆర్ఎస్ అసత్యపు ప్రచారం చేసిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం లేకున్నా రికార్డు స్థాయిలో వరి దిగుబడి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు వరిసాగు పెరగటంతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైందని సీఎం రేవంత్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగి.. నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.



కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా రికార్డు స్థాయిలో వరి దిగుబడి వచ్చింది. కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరిసాగు పెరిగిందన్న బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైంది. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగి.. నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా.. ఎన్డీఎస్ఏ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా.. కాళేశ్వరంతో సంబంధం లేకుండా తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రికార్డు స్థాయిలో వరిధాన్యం పండింది. ఇది తెలంగాణ రైతుల ఘనత. వారి శ్రమ, చెమట, కష్టం ఫలితం. తెలంగాణ రైతు దేశానికే గర్వకారణం. ఈ ఘనత సాధించిన ప్రతి రైతు సోదరుడికి హృదయపూర్వక అభినందనలు.' అని సీఎం రేవంత్ ట్వీట్ చేశారు.

### రైతుల ఖాతాల్లోకి


## బోనస్ డబ్బులు

రైతులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్ ఇక తెలంగాణ ప్రభుత్వం అన్నదాతకు తీపి కబురు చెప్పింది. రైతుల ఖాతాల్లో వరికి బోనస్ డబ్బులు జమ చేస్తుంది. సన్నరకం వరి ధాన్యం క్వింటాకు రూ.500 చొప్పన రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఈ నెల 11న ప్రయోగాత్మకంగా ఓ అన్నదాత ఖాతాలో క్వింటాకు రూ.500 చొప్పన 60 క్వింటాళ్లకు మొత్తం రూ.30 వేలు జమ చేశారు. శనివారం (నవంబర్ 16) సుమారు రూ.కోటి పైగా బోనస్ చెక్కులపై తెలంగాణ సివిల్ సప్లయ్ శాఖ సంతకాలు చేసింది. రానున్న 48 గంటల్లో అన్నదాతల ఖాతాల్లోకి వరికి రూ.500 బోనస్ డబ్బులు జమ చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు.

# కేటీఆర్ అరెస్ట్ కథ కంచికే

- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసులన్నీ గాలికే
- కలెక్టర్ పై దాడి సూత్రధారి కేటీఆర్ అని తెలినా అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు
- సర్కార్ చేతగానితనమే కారణం.. రాష్ట్రంలో ఆర్ కే బ్రదర్స్ పాలన నడుస్తోంది
- కేసీఆర్, రేవంత్ కుటుంబానికి మధ్య వ్యాపార సంబంధాలున్నయ్
- బీఆర్ఎస్ విధ్వంసకర పార్టీ.. దాడులతో ప్రజల ప్రాణాలాతో చెలగాటాలాడుతోంది
- తెలంగాణలో బీఆర్ఎస్ ను నిషేధించాలి..
- రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు అప్పగించే అవకాశాల్లేవ్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**సంగారెడ్డి, మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. లగిచర్ల ఘటనసహా అనేక స్కాంల్లో ప్రమేయమున్నప్పటికీ మాజీ మంత్రి కేటీఆర్ ను అరెస్ట్ చేసే అవకాశాల్లేవని వ్యాఖ్యానించారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మాట్లాడుకున్నారని, వాళ్లకు చేయాల్సిందంతా చేశారని చెప్పారు. ఇక కేటీఆర్ అరెస్ట్ కథ అటకెక్కినట్లేనని అన్నారు. రాష్ట్రంలో ఆర్కే (రేవంత్, కేసీఆర్) ఫ్యామిలీ పాలన నడుస్తోందన్నారు. ఆ రెండు కుటుంబాల మధ్య వ్యాపార సంబంధాలున్నాయని బాంబు పేల్చారు. ఆధారాలతోసహా బయటపెట్టేందుకు తాను సిద్ధమన్నారు. తనకు, రేవంత్ రెడ్డి మధ్య ఎలాంటి వ్యాపార బంధాలు లేవని స్పష్టం చేశారు. తమ మధ్య వ్యాపార సంబంధాలున్నట్లు నిరూపిస్తేరాజకీయాల నుండి తప్పుకుంటానని బీఆర్ఎస్ నేతలకు సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో విధ్వంసం సృష్టించి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందన్నారు. అందుకోసం ప్రజల ప్రాణాలను బలిపెట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళన, కానిస్టేబుళ్ల ఆందోళనలో బీఆర్ఎస్ నేతలు విధ్వంసం సృష్టించేందుకు యత్నించారని అన్నారు. రైతుల ముసుగులో దాడులకు పాల్పడుతోంది కూడా బీఆర్ఎస్ నేతలేనన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ను నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. సంగారెడ్డికి వచ్చిన కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. రెండ్రోజులు అరోగ్యం బాగోలేకపోవడంవల్ల బయటకు రాలేకపోయానని, అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని అంటున్నారని వాళ్లకు కలలో కూడా నేనే కన్పిస్తున్నానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు వడ్ల కొనుగోళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని. 95 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందన్నారు. నవంబర్ 15 నాటికి 25 నుండి 30 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలన్నారు. అందులో సగం కూడా నేటికీ సేకరించలేకపోయిందన్నారు. సగానికి పైగా వడ్లు ఇప్పటికే బ్రోకర్ల పాలైందని, రైతులు తీసుకొచ్చిన వడ్లన్నీ అడ్డికి పావుశేరుగా మిల్లర్లకు అమ్ముకుంటున్నారన్నారు. కనీస మద్దతు ధర 2300 రూపాయలుంటే... కనీసం 2 వేల రూపాయల ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లకు బోనస్ ఇస్తామనడం అంతా బోగస్ గా మారిందని మండిపడ్డారు. సీఎం, మంత్రులకు ఛాలెంజ్ చేస్తున్నా రాష్ట్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్దకు పోదాం తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటున్నట్లు నిరూపించండన్నారు. రైతులందరికీ బోనస్ ఇస్తున్నట్లు నిరూపిస్తారా? మీరు నిరూపిస్తే నేను ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానని అన్నారు. కటింగ్ పేరుతో, తాలు తరుగు తేమ పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నట్లు నిరూపిస్తానని, కనీస మద్దతు ధర అందక, బోనస్ రాక రైతులు అల్లాడుతున్నట్లు నిరూపిస్తానని మీరు ముక్కు నేలకు రాసి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పి పదవుల నుండి తప్పుకుంటారా? దమ్ముంటే నా సవాల్ కు అంగీకరించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని మాట తప్పిన చరిత్ర కాంగ్రెస్ దే. రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని కాంగ్రెస్ మాట తప్పారన్నారు.



**లగిచర్ల ఘటనపై స్పందిస్తూ**

రైతుల సమస్యల గురించి మాట్లాడాలని అడుగుతుంటే, కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాసిటీ కోసం మా సాగు భూములను ఎందుకు తాకట్టు పెడుతున్నారని రైతులు కొట్లాడుతుంటే వాళ్లకు న్యాయం చేయాల్సింది పోయి రైతుల ముసుగులో జిల్లా కలెక్టర్, అధికారులపై దాడులు చేయించారంటూ ఇదేమైనా రాచరిక పాలన అనుకుంటున్నరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ దాడులకు, రైతులకు ఏం సంబంధం? రైతుల కష్టాలను చెప్పుకుంటే దానిపై చర్చించకుండా దాడుల గురించి మాట్లాడతారా? కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా జనంలో చర్చ పెడతారా? ఇదేం పద్దతి అని నిలదీశారు. కలెక్టర్ పై దాడులు చేసింది బీఆర్ఎస్ గూండాలని కలెక్టర్ నివేదిక ఇచ్చారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతోపాటు కేసీఆర్ కొడుకు హస్తముందని కూడా ప్రభుత్వమే చెబుతోంది. అయినా కేసీఆర్ కొడుకును ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? ప్రభుత్వ చేతగానితనం కాకపోతే మరేమిటి? కలెక్టర్ పై దాడి చేస్తే సూత్రధారిని అరెస్ట్ చేయకపోవడం ముమ్మాటికీ చేతగానితనమే. అసలు రైతులు ఏం పాపం చేశారు? వాళ్లను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారన్నారు. రెండు రోజులుగా కేసీఆర్ కొడుకు రెండ్రోజుల నుండి టీవీలకు ఇంటర్వ్యూలిస్తూ అరెస్ట్ చేసుకోండని నటనా చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని, ప్రభుత్వ చేతగానితనంవల్ల ఆయన నటిస్తున్నాడన్నారు. ఎందుకంటే ఈ వ్యవహారంలో ఢిల్లీకి పోయి కాంగ్రెస్ హైకమాండ్ ను కలిసిండు. చేయాల్సింది చేసిండు. ఈ కేసును అటకెక్కించిండన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని తేల్చినా వాళ్లను అరెస్ట్ చేయలేదని గుర్తు చేశారు. సాక్షాత్తు కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని రాధాకిషన్ రావు వాంగ్మూలమిచ్చినా పట్టించుకోరు? జన్వాడ ఫాంహౌజ్ రేవ్ పార్టీలో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దొరికినా, విజయ్ మద్దూరి వాంగ్మూలమిచ్చినా అరెస్ట్ చేయరు? ఈ ఫార్ములా రేస్ స్కాంలో కేసీఆర్ కొడుకు దాదాపు 50 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని నివేదిక ఇచ్చినా అరెస్ట్ చేయరు? కనీసం నోటీసులు కూడా ఇవ్వరు? ధరణి పేరుతో అడ్డగోలుగా వేల కోట్ల విలువైన భూములను కొల్లగొట్టినట్లు తేలినా ఎందుకు అరెస్ట్ చేయరని ప్రశ్నించారు.

# ఎమ్మెల్సీతో పాటు బోనస్

## కాంటా పెట్టిన మూడు రోజుల్లోనే ఖాతాల్లో జమ

**రైతుల ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 33 కోట్ల బోనస్**

**ఇప్పటికే రూ. 500 ల బోనస్ కోసం వెయ్యి కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**ప్రతిపక్షాలవి అవగాహన లేని ఆరోపణలు**


**రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ,తెలంగాణ కిసాన్ కాంగ్రేస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** రైతులకు ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి తెలిపారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు ధాన్యం డబ్బుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగడం లేదని, కాంటా పెట్టిన మూడు రోజుల్లోపే ఎమ్మెస్పీ, బోనస్ కలిపి చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల ధర అమాంతం పెరిగిందని, క్వింటాలుకు రూ. 2,800 నుంచి రూ. 3 వేల వరకు ధాన్యం ధర పలుకుతుందని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, రైతులు రైతు సంఘాలు రైసుమిల్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని కొత్త ధాన్యం సేకరణ పాలసీని తయారుచేసి... పకడ్బందీగా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రొక్యూర్మెంట్ లో అంతులేని అక్రమాలు జరిగాయని, బీఆర్ఎస్ నేతలు రైస్ మిల్లర్లు కలిసి రైతులను అడ్డగోలుగా దోచుకున్నారని అన్నారు. కేసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు సన్నలకు బోనస్ ప్రకటించి ఎగ్గొట్టారని అన్వేష్ రెడ్డి గుర్తు చేశారు.



బోనస్ కోసం రైతులు నిలదీస్తే... బోనస్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అంగీకరించడం లేదని, అందుకే బోనస్ ఇవ్వడం కుదరదని చెప్పి రైతులను మోసం చేశారని అన్నారు. సన్నాలకు బోనస్ ఇవ్వాలని రైతులు అడిగితే... బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకొని రైతులకు అన్యాయం చేశారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని, ఇద్దరి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎఫ్‌సీఐ నిబంధనలు అంగీకరించకపోయినా... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బోనస్ చెల్లిస్తున్నదని తెలిపారు. బోనస్ కోసం ఇప్పటికే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వేయి కోట్ల ను కేటాయించిందని, ఇప్పటికే సుమారు రూ.33 కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ అయ్యిందని చెప్పారు. నిన్నటి వరకు 12.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మా ప్రభుత్వం కొనుగోలు చేసింది ఇందులో 2.76 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొన్నామన్నారు. గత ప్రభుత్వం పోయిన ఖరీఫ్ లో నిన్నటి వరకు కొన్నది 11. 45లక్షల మెట్రిక్ టన్నులేనని వివరించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి ఎంఎస్పీ, ఆర్థికశాఖ నుంచి బోనస్ చెల్లించటానికి ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగిస్తున్నట్లు అన్వేష్ రెడ్డి తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఈ వానా కాలం సీజన్ లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తోనే గతంలో పంటలు పండాయని కేసిఆర్ ప్రగల్బాలు పలికారని... ఈ వానాకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు మూడు లిఫ్టుల నుంచి ఒక్క చుక్క నీరు విడుదల చేయకపోయినా కాళేశ్వరం ప్రాజెక్టు మూడు లిఫ్టుల నుంచి ఒక్క చుక్క నీరు విడుదల చేయకపోయినా... కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని రైతులు చేశారని అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు.

# సాహితీమూర్తులు
## ఆరుద్ర.. ఆరో రుద్రుడు



అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని సాహితీ మూర్తుల్లో ఆరుద్ర ఒకరు. ఆరుద్ర పూర్తిపేరు భాగవతుల సదాశివశంకర శాస్త్రి . శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవిగా పేరు పొందిన ఆరుద్ర అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకుడు, నాటక కర్త మరియు విమర్శకుడు. ఆధునిక ఆంద్ర సాహిత్య చరిత్రలో ఒక సముచిత స్థానాన్ని సంపాదించుకున్న మహానుభావుడు. ఇతను 'ఆరుద్ర' కాడు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత అనిపించుకొన్న ధన్యజీవి. వీరు మహాకవి శ్రీశ్రీకి బంధువులు కూడా.1925,ఆగష్టు 31న ఆరుద్ర జన్మించారు. సంతకం అక్కరలేని కవి ఆరుద్ర. ఆరుద్ర రచనల్లో కూనలమ్మపదాలు ఎంతో పేరు గాంచినవి. మహాకవి శ్రీశ్రీ మాటల్లో కూనలమ్మ పదాల ఆరుద్ర గురించి

కూనలమ్మ పదాలు
వేనవేలు పదాలు
ఆరుద్రదే వ్రాలు
.
కూనలమ్మ పదాలు
లోకానికి సవాలు
ఆరుద్రదే వ్రాలు
.
కూనలమ్మ పదాలు
కోరుకున్న వరాలు
ఆరుద్ర సరదాలు
....................
ఇక కూనలమ్మ పదాల్లో..



పరుల మేలును కోరి
పదము లల్లెడువారి
పథము చక్కని దారి
ఓ కూనలమ్మ!
-----
సర్వజనులకు శాంతి
స్వస్తి, సంపద, శ్రాంతి
నే కోరు విక్రాంతి
ఓ కూనలమ్మ !
....
తాగుచుండే బుడ్డి
తరుగుచుండే కొద్ది
మెదడు మేయును గడ్డి
ఓ కూనలమ్మా

మనసు తెలుపని భాష
మంచి పెంచని భాష
ఉత్త సంద్రపు ఘోష
ఓ కూనలమ్మా

..
ఇలా ఎన్నో అణిముత్యాలు.. అద్భుతాలు ఆరుద్ర రచనలు చదువుతున్నకొద్దీ చదివిస్తాయి.
- జికెఎం

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

# బ్లూ సిటీ..
BLUE CITY JODHPUR

## నీలిరంగు నిగనిగలు.. గొప్పనగరం.. జోధ్ పూర్

**ఆ నగరంలో ఎటు చూసినా నీలిరంగు మేడలే . ఇదేదో గ్రీస్ దేశం అనుకుంటే పొరపాటే.. మన దేశంలోనే ఉంది ఈ 'బ్లూ సిటీ'. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌ను 'బ్లూ సిటీ' అని పిలుస్తారు. ఇక్కడి నీలం రంగు ఇళ్లు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ ఉండే భవనాలు నీలిరంగులో నిగనిగలాడుతుంటాయి. దీంతో దీన్ని బ్లూ సిటీ ఆఫ్ ఇండియాగా అభివర్ణిస్తారు. ఇక్కడ ఎటు చూసినా బ్లూ కలర్ భవనాలే దర్శనమిస్తాయి. అలా ఈ నగరం మొత్తం చూడటానికి చాలా వైవిధ్యభరితంగా ఉంటుంది. ఎలాంటి టూరిస్టులైనా ఈ బ్లూ సిటీని సందర్శిస్తే తప్పక ఆశ్చర్యపోతారు. అంత గొప్ప నగరంగా పర్యాటకుల్ని ఆకర్షించేలా ఉంటుంది.**



జోధ్‌పూర్ నగరంలోని బ్రహ్మపురి ప్రాంతం, ఒక కొండపైన ఓ సుప్రసిద్ధ కోట పాదాల వద్ద ఉంటుంది. 1459లో రాజ్‌పుత్ రాజు రావ్ జోధా నిర్మించిన, ఎత్తైన గోడలతో నీలం రంగు ఇళ్లు ఉన్న ఈ సెటిల్మెంట్ క్యాంప్‌ను, పాత జోధ్‌పూర్ లేదా అసలైన జోధ్‌పూర్ నగరం అంటారు. అయితే, 17వ శతాబ్దానికి ముందు ఈ ప్రాంతంలో నీలం రంగును ఉపయోగించేవారు కాదని, ఆ తర్వాతే ఇలాంటి రంగు ఇళ్లు జోధ్‌పూర్ ప్రత్యేక గుర్తింపుగా మారాయని జిందాల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన ఎస్తేర్ క్రిస్టీన్ ష్మిత్ చెప్పారు. గత 70 సంవత్సరాలుగా ఈ నగరం బాగా విస్తరిస్తున్నా, ఇప్పటికీ బ్రహ్మపురి ప్రాంతమే జోధ్‌పూర్‌కు గుండెకాయలా ఉందని మెహ్రాన్‌గఢ్ మ్యూజియం క్యురేటర్ సునయన రాథోడ్ అన్నారు. బ్రహ్మపురి అంటే సంస్కృతంలో 'బ్రాహ్మణుల పట్టణం' అని అర్థం. నీలం రంగును తమ సాంస్కృతిక పవిత్రతకు చిహ్నంగా స్వీకరించిన బ్రాహ్మణ కుటుంబాల కాలనీగా దీన్ని నిర్మించారు.

15వ శతాబ్దంలో స్పానిష్‌ల దాడి నుంచి పారిపోతూ మదీనాలో శెఫ్చెవెన్ లేదా బ్లూ సిటీ ఆఫ్ మొరాకో అని పిలిచే పట్టణంలోని పాత భాగంలో స్థిరపడిన యూదుల్లా, వారు ప్రత్యేకంగా ఉన్నారు. శెఫ్చెవెన్‌లోని ఇళ్లు, మసీదులు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా నీలం రంగులో ఉంటాయి. జుడాయిజంలో దీన్ని పవిత్రమైన ఆకాశాన్ని సూచించే రంగుగా పరిగణిస్తారు. అయితే, ఈ నీలం రంగు చాలా రకాలుగా ఉపయోగపడింది. బ్రహ్మపురిలో లైమ్‌స్టోన్ ప్లాస్టర్‌తో కలిపిన ఈ నీలి రంగు పెయింట్ , పర్యటకులను ఆకర్షించడంతో పాటు, ఇళ్ల లోపలి భాగాలను చల్లబరుస్తుంది.



## వారసత్వానిదే బాధ్యత

అయితే శెఫ్చెవెన్‌లా కాకుండా, జోధ్‌పూర్‌లో నీలి రంగు మసకబారడం ప్రారంభించింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. చరిత్రాత్మకంగా, ఈ ప్రాంతంలో సహజమైన నీలి మందు సులభంగా లభ్యం కావడం వల్ల బ్రహ్మపురి నివాసితులు ఈ రంగును ఎంచుకున్నారు. తూర్పు రాజస్థాన్‌లోని బయానా పట్టణం ఒకప్పుడు దేశంలోని ప్రధాన నీలిమందు ఉత్పత్తి కేంద్రాలలో ఒకటి. కానీ సంవత్సరాలు గడిచేకొద్దీ, ఆ పంటను ఎక్కువగా పండించడం వల్ల నేల ఎక్కువగా దెబ్బతిని, దానిని పండించడం, ఉపయోగించడం తగ్గింది. అంతేకాకుండా నగరాలలో కొత్త సంస్కృతులు, కొత్త ప్రజలు రావడంతో, స్వదేశీ నిర్మాణ పద్ధతులు వేడి వాతావరణంలో లైమ్ ప్లాస్టర్‌ను ఉపయోగించడం, నీలం రంగును సరిగా గ్రహించని సిమెంట్ లేదా కాంక్రీటును ఉపయోగించడం వంటి కొత్త సాంకేతికతలు వస్తున్నాయి.


బ్రహ్మపురికి చెందిన 29 ఏళ్ల సివిల్ ఇంజనీర్ ఆదిత్య దవే మాట్లాడుతూ, తమ 300 ఏళ్ల నాటి సొంత ఇల్లు చాలా వరకు నీలం రంగులో ఉందని, అయితే ఇప్పుడు బయటి గోడలకు ఇతర రంగుల్లో పెయింట్ వేస్తున్నామని చెప్పారు. దవే ఐదేళ్ల కిందట బ్రహ్మపురిలో తన సొంత ఇంటిని నిర్మించినప్పుడు, ముందు భాగంలో తరచుగా మార్చాల్సిన అవసరం లేని టైల్స్‌ను పెట్టించారు. దీనికి కారణం ప్రధానంగా నీలిమందు ధర పెరగడం, గోడలను పాడుచేసే ఓపెన్ డ్రెయిన్ వల్ల కూడా ఈ రంగు వాడకం తగ్గుతోంది. ఈ మార్పు సందర్శకులను మోసగించినట్లు అనిపిస్తుందని బ్రహ్మపురిలో నీలిరంగు ఇళ్ల సంరక్షణ, వాటి పునరుద్ధరణ కోసం స్థానిక అధికారులతో కలిసి పనిచేసే వస్త్రాల వ్యాపారి దీపక్ సోని చెప్పారు. "మన నగరానికి గుర్తింపుగా నిలిచిన ఇళ్ల కోసం ఎవరైనా వెతుకుతున్నారంటే, మనం సిగ్గుపడాలి. చాలా మంది విదేశీయులు జోధ్‌పూర్‌ని శెఫ్చెవెన్‌తో పోలుస్తారు. శెఫ్చెవెన్ నగరంలో ఇళ్లు శతాబ్దాలుగా నీలం రంగులో ఉంటే, మనమెందుకు ఆ పని చేయలేం?'' అని ఆయన ప్రశ్నించారు.

2018లో బ్రహ్మపురి వారసత్వాన్ని కాపాడేందుకు స్థానిక అధికారులు, సంఘాలతో దీపక్ సోని చర్చలు జరిపారు. 2019 నుంచి, ఆయన ప్రతి సంవత్సరం 500 ఇళ్ల బయటి గోడలకు నీలం రంగు వేయడానికి బ్రహ్మపురి నివాసితుల నుంచి నిధులు సేకరిస్తున్నారు. గత కొన్నేళ్లలో ఆయన బ్రహ్మపురిలోని దాదాపు 3,000 మంది ఇంటి యజమానులను తమ ఇంటి బయటి గోడలు, పై కప్పులకు నీలం రంగులోకి మార్చేలా ఒప్పించారు. "ఎవరైనా బ్రహ్మపురి ఫొటోను తీసినప్పుడు, కనీసం బ్యాక్‌గ్రౌండ్ నీలం రంగులో కనిపిస్తుంది" అని ఆయన చెప్పారు.



## సంరక్షించుకోవాలి వారసత్వం

బ్రహ్మపురిలోని దాదాపు 33,000 ఇళ్లలో దాదాపు సగం ప్రస్తుతం నీలం రంగులో ఉన్నాయని సోనీ అంచనా వేస్తున్నారు. ఆయన స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇళ్లకు లైమ్ ప్లాస్టర్‌ను వేయించే ప్రయత్నం చేస్తున్నారు. ''మా సొంతం అనుకునే ఈ నగరానికి నేను చేయగలిగే అతి చిన్న మేలు ఇదే'' అని ఆయన అన్నారు. "జోధ్‌పూర్ ప్రజలే దాని వారసత్వం గురించి పట్టించుకోకపోతే, బయటివాళ్లు మన నగరం గురించి ఎందుకు పట్టించుకుంటారు?" అని ఆయన అంటున్నారు.



# కలెక్టర్ వర్సెస్ వ్యాపారులు..!

## 18 మంది వ్యాపారులకు నోటీసులు

వివరణ ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు
19 నుండి వ్యాపారాలు కొనుగోళ్ల నిలిపివేత
మార్కెట్ లో ముదురుతున్న కొనుగోళ్ల వ్యవహారం
సిండికేట్ తో ధర తొక్కి పెడుతున్న వైనం
సీసీఐ కొనుగోలు చేస్తే అభ్యంతరం లేదంటున్న వ్యాపారులు





**ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, మహా:** రైతులకు మద్దతుగా కలెక్టర్ తీసుకున్న నిర్ణయం ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో తీవ్ర సంచలనం రేకెత్తిస్తుంది. సిండికేట్ గా మారిన వ్యాపారులు పత్తి ధరను అమాంతం తగ్గించి కొనుగోలు చేసిన వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సీరియస్ గా పరిగణించారు. గత నాలుగు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఆకస్మిక తనిఖీ చేసి వ్యాపారం చేస్తున్న ఆగడాలకు బ్రేక్ వేశారు. తేమ పేరుతో వ్యాపారులు ధర తగ్గించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా ఖమ్మం మార్కెట్ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 18 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. లిఖితపూర్వకంగా సమాధానం చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో వ్యాపారుల్లో వణుకు పుట్టడమే కాకుండా వివాదానికి ఆజ్యం పడింది. కలెక్టర్ జారీ చేసిన నోటీసులకు సమాధానం చెప్పేందుకు ఇష్టం లేని వ్యాపారులు ఏకంగా మార్కెట్లోనే పత్తి కొనుగోలు నిలిపివేసేందుకు సిద్ధమైనారు. వ్యాపారులందరూ సిండికేట్ గా మారి ఈ నెల 19వ తేదీ నుండి ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో పత్తిని ఖరీదు చేయబోమని డిసైడ్ అయ్యారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో 150 మంది వరకు కమీషన్ వ్యాపారులు ఉన్నారు. జిల్లా కలెక్టర్ 18 మందికి నోటీసులు జారీ చేయడంతో మిగిలిన వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ సిండికేట్ గా మారి ఏకంగా కొనుగోలను నిలిపివేయాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ వ్యవసాయ మార్కెట్లోని విధంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు వ్యవహారం దగ్గర నుండి, ట్యాక్స్ చెల్లింపువరకు వ్యాపారులందరూ ఒకే మాట మీద ఉంటారు. అంతర్జాతీయంగా పార్టీ మిర్చి పంటలకు ఎక్కువ ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం ఈ వ్యాపారాలు చెప్పినది శాసనంగా మారింది. ఈ నేపథ్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో పత్తి పంటను 7 వేలకు మించి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయడంలేదు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు తేమశాతం తక్కువగా ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం రకరకాల సాకులతో ధరలు తొక్కిపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు తీసుకువచ్చిన పత్తి పంటకు మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా ఎందుకు తక్కువగా కొనుగోలు చేశారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 18మందికి, ఒక కమీషన్ వ్యాపారికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో లైసెన్సులు రద్దు చేస్తామని నోటీసులు జారీచేయడంతో వివాదాస్పదంగా మారింది. నోటీసుల జారీని తీవ్రంగా వ్యతిరేఖిస్తున్న దిగుమతి, ఎగుమతి శాఖలు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఖమ్మం వర్తక సంఘ భవనంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మార్కెట్ కమిటీ అధికారుల నోటీసుల జారీని తప్పుబట్టారు. మార్కెట్లో కొనుగోళ్లకు తాము దూరంగా ఉంటామని, సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేయించుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఖరీదు, కమీషన్ వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో అనే విషయంపై ఉత్కంఠ నెలకొన్నది. అధికారులు రైతుల పక్షాన ఉండాలి కానీ, వ్యాపారుల పక్షాన ఉండకూడదని ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో రైతుల సాక్షిగా కలెక్టర్ చెప్పిన మాటలు ఏ మేరకు సఫలం అవుతాయో ఎదురుచూడాల్సిందే.

**మార్కెట్లో నోటీసులు అందుకున్న ఖరీదు వ్యాపారులు వీరే..**

1. జై గణేష్ ట్రేడర్స్
2. శివ శంకర్ ట్రేడర్స్
3. ఓం శక్తి ట్రేడర్స్
4. మెస్సర్స్ శ్రీ గణేష్ కాటన్ ట్రేడర్స్
5. శ్రీధర ఎంటర్ ప్రైజెస్.
6. మెస్సర్స్ వాణి ట్రేడర్స్ .
7. మెస్సర్స్ శ్రీ రామ ట్రేడర్స్
8. శ్రీ రవళి క్రిష్ణకాటన్ ట్రేడర్స్
9. ఎస్ ఎస్ అగ్రి ట్రేడర్స్
10. జై విఘ్నేశ్వర కాటన్ ట్రేడర్స్
11. ఎంకే అగ్రి ట్రేడర్స్
12. శ్రీశివ గణేష్ క్రిష్ణ ట్రేడర్స్
13. శ్రీ సాయి కౌషిక్ ట్రేడర్స్
14. మెస్సర్స్ శ్రీ లక్ష్మీ క్రిష్ణట్రేడర్స్ (న్యూ)
15. మెస్సర్స్ శ్రీ మణికంట ట్రేడర్స్
16. జీఆర్ఆర్ ఇండస్ట్రీల్ ప్రైవేట్ లిమిటెడ్
17. జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్
18. శిరిడీ సాయిబాబా ట్రేడర్స్

# హెయిర్ కటింగ్ తెచ్చిన తంటా..!

## డిఫరెంట్ ట్రిమ్మింగ్ చేయించుకున్న విద్యార్థి

### అది నచ్చక గుండు కొట్టించిన ప్రొఫెసర్



**ఖమ్మం, నవంబర్ 17, మహా:** ఓ విద్యార్థి హెయిర్ కటింగ్ నానా తంటాలు తెచ్చిపెట్టింది. లేటెస్ట్ ఫ్యాషన్ పేరుతో చేయించుకున్న చైనీస్ హెయిర్ కటింగ్ కళాశాలలో ర్యాగింగ్ కు దారి తీయడం.. ఆపై అసిస్టెంట్ ప్రొఫేసర్ కలగజేసుకోవటం... దీనిపై విద్యార్థి మనస్థాపన చెందడం... చివరికి క్రమశిక్షణ చర్యలో భాగంగా అసిస్టెంట్ ప్రొఫేసర్ పై ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోవడం వంటి సంఘటన ఖమ్మం మెడికల్ కళాశాలలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వీళ్లకు వచ్చిన ఈ సంఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే... ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరాడు. కళాశాల హాస్టల్లో ఉంటున్న ఈ విద్యార్థి ఈనెల 12న రాత్రి చైనీస్ స్టైల్లో హెయిర్ కటింగ్ చేయించుకుని వచ్చాడు. ఈ క్రమంలో సెకండియర్ విద్యార్థులు అది బాగులేదని ర్యాగింగ్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆ విద్యార్థి మళ్లీ వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకుని వచ్చాడు. ఆ విద్యార్థి వచ్చేసరికి హాస్టల్లో యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫేసర్ రెహమాన్ విద్యార్థి కటింగ్ విషయాన్ని తెలుసుకుని కోపోద్రిక్తుడయ్యాడు. అంతటితో ఆగకుండా విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటికి తీసుకెళ్లి సెలూన్ షాప్ లో గుండు కొట్టించారు. వరుసగా జరిగిన సంఘటనపై ఆ విద్యార్థి తీవ్ర మనస్థాపానికి గురైనాడు. జరిగిన సంఘటన గురించి విద్యార్థి కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర రావుకి ఫిర్యాదు చేశాడు.

ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనను ఎక్కడ బయటకు పొక్కనీయకుండా కళాశాల ప్రిన్సిపాల్ త్రీ మెన్ కమిటీ విచారణకు ఆదేశించారు. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ ప్రొఫేసర్ ను బాయ్స్ హాస్టల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆఫీసర్ విధుల నుంచి తొలగించారు. ఇదే విషయమై ప్రిన్సిపాల్ ను వివరణ కోరగా.. ఈ ఘటనను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అంతేకాకుండా విచారణకు థోర్మెన్ కమిటీని నియమించామని పేర్కొన్నారు. మొత్తం మీద ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓ విద్యార్థి చైనీస్ హెయిర్ కటింగ్ ర్యాగింగ్ కి దారి తీయడం.. ఆపై అసిస్టెంట్ ప్రొఫేసర్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే విధంగా దారితీసింది.

# గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించిన సీపీ



**ఖమ్మం క్రైమ్, నవంబర్ 17, మహా:** గ్రూప్ 3 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 87 పరీక్షా కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించేందుకు ఆదివారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజ్ పరీక్షా కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉన్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులు పెట్రోలింగ్, బందోబస్తుతో అప్రమత్తం వుండాలని ఆదేశించారు.

# క్రీడాకారుడి భవిష్యత్తుకు అండగా నిలుస్తా

## : ఎమ్మెల్యే జారే హామీ





**అశ్వారావుపేట /దమ్మపేట, నవంబర్ 17, మహా:** దమ్మపేట మండలం రాచూరుపల్లి, మల్కారం పంచాయతీలలో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన చేశారు. గ్రామస్తుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని, వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాచూరుపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కోర్స నాగరాజు గతంలో ప్రమాదవశాత్తు కాలు కోల్పోగా, ఆయనకు నాలుగు లక్షల రూపాయల విలువైన రోబోటిక్ కృత్రిమ కాలును హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో అమర్చించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేశారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ, నాగరాజు భవిష్యత్తుకు అండగా నిలుస్తానన్నారు. అతడిని జాతీయ స్థాయిలో ఆటల్లో పాల్గొనడానికి అవసరమైన సహాయం అందిస్తా అని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు, స్థానికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలపై వినతిపత్రం సమర్పించిన ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం సిటీ , నవంబర్ 17, మహా:** రాష్ట్రంలోని బీసీ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లాలో పర్యటించిన బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొత్తా సీతారాములు, మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీని అరికట్టాలని పిలుపు



**అశ్వారావుపేట, నవంబర్ 17, మహా:** అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామంలో ఆదివారం పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యూ నేతలు ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ దోపిడీకి వ్యతిరేకంగా గోడపోస్టర్లు ఆవిష్కరించారు. పి.వై.ఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ హాస్పిటల్స్ లో వైద్య సౌకర్యాల కొరతతో ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్ కి వెళుతున్నారు. టెస్టులు, మందుల పేరుతో కార్పొరేట్ హాస్పిటల్స్ ప్రజలను దోచుకుంటున్నాయి అని ఆరోపించారు. ప్రభుత్వం డయాగ్నొస్టిక్ సెంటర్లు, మెడికల్ మాఫియాపై నియంత్రణ విధించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ హాస్పిటల్స్ ను సూపర్ స్పెషాలిటీ స్థాయికి మెరుగుపరచాలని కోరారు. ప్రైవేట్ దోపిడీ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ నాయకులు కంగాల వెంకటేష్, కొమరం లక్ష్మణ్ రావు, పి.ఓ.డబ్ల్యూ నాయకురాలు కుంజా లక్ష్మి, కోడిమి పార్వతి పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల ఘటనపై మంత్రి సీరియస్

## ఉన్నతాధికాలతో కాన్ఫరెన్స్ పై బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



**ఖమ్మం, నవంబర్ 17, మహా:** ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఘటనను ప్రభుత్వం సీరియస్ గా పరిగణించింది. మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థికి గుండు కొట్టించిన విషయంపై తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యాను. ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం ర్యాగింగ్ గురించి పూర్తి విషయాలు తెలుసుకొని ఉన్నతాధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కళాశాలలో జరిగిన సంఘటన సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి ఘటనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంగ్ విషయంలో పోలీస్ శాఖ సహకారం తీసుకుని అన్ని కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ర్యాగింగ్ తో విద్యార్థులు వారి అందమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. అంతేకాకుండా అన్ని కళాశాలలో ర్యాంక్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

# రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

## బూసాని వేంకటేశ్వర రావు



**ఖమ్మం, నవంబర్ 17, మహా:** స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు చేసేందుకు వివిధ సంఘాల నుండి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ నివేదికను ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో సమర్పిస్తామని తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వేంకటేశ్వర రావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపును పేర్కొనే అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన బహిరంగ విచారణలో సెక్రటరీ బి. సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బూసాని వేంకటేశ్వర రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల ప్రజల రిజర్వేషన్ దామాషా ఖరారు చేసేందుకు ప్రభుత్వం డెడికేటెడ్ బీసీ కమిషన్ ను ఏర్పాటు చేసిందని తెలిపారు. రిజర్వేషన్ సంబంధిత అంశాలు మాత్రమే తెలియజేయాలని, మిగిలిన అంశాలు బీసీ కమిషన్ పర్యటనలో తెలపాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ క్రింద వృత్తుల జనాభా వివరాలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ క్రింద నమోదు చేసి గుర్తించాలని కోరగా, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్పొరేటివ్ సొసైటీ యాక్ట్ కింద నిర్వహించే ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావని, ఆ అంశం తన పరిధిలో లేదని అన్నారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ దామాషా అమలుపై వివిధ సంఘాల ప్రతినిధుల నుంచి సేకరించిన ప్రతిపాదనలు, అభిప్రాయాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నెలలో నివేదిక ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వి. రమేష్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బీసీ సంక్షేమ అధికారులు జి. జ్యోతి, ఈ. ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొదట కలెక్టరేట్ ఆవరణలో రిజిస్ట్రేషన్ సెంటర్, నమోదు కేంద్రంను కమిషన్ చైర్మన్ పరిశీలించారు. అనంతరం వివిధ సంఘాలు, వ్యక్తుల నుండి విజ్ఞాపణలు స్వీకరించారు. కమిషన్ చైర్మన్ కు వడ్డెర సంఘం ప్రతినిధులు, సంచార జాతుల ప్రతినిధులు, విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాలు, ముస్లిం, మైనారిటీ, మత్స్యకారుల సంఘం, ఆల్ ఇండియా ఓబీసీ కులాల, పూసల, చాకలి, దుదెకులు, యాదవ, గొల్ల కురుమ, సంచార ముస్లిం జాతి, కుమ్మరి, ఎంబీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ దామాషా అమలు, తమ వర్గాలకు ఉన్న వివిధ సమస్యలపై అభిప్రాయాలు తెలుపుతూ విజ్ఞాపణలు అందజేశారు.

# నేడు ఉభయ జిల్లాల్లో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన



**ఖమ్మం, నవంబర్17, మహా:** పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి సోమవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని ఆరోగ్య హాస్పిటల్ లో ఆర్థో యాక్సిడెంట్ కేర్ యూనిట్ ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఉదయం 11.30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి చేరుకుంటారు. అక్కడ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు పెనుబల్లి మండలం టేకులపల్లిలో ఓ శుభకార్యానికి హాజరవుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు తల్లాడ మండలం మిట్టపల్లి, మధ్యాహ్నం 3 గంటలకు నూతనకల్ గ్రామాల్లో మృతుల కుటుంబాలను ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పరామర్శించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఖమ్మం గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారు. ప్రజలు, శ్రేణులను కలుసుకుంటారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

# మేడారంలో భక్తుల సందడి




**తాడ్వాయి, నవంబర్ 17, మహా:** వన దేవతలను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు తల్లిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున వచ్చారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించి వన దేవతలకు పసుపు కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.

**క్రీడా వస్తువుల పంపిణీ**

మండలంలోని ఊరటం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం కేఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడవస్తులు పంపిణీ చేశారు. కేఎస్ఎస్ చైర్మన్ కోల సందీప్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం రమణయ్య, మహమ్మద్ రఫీ పాషా, జనగాం కిరణ్, మహిపతి సంతోష్, సర్ప రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యటించిన తుంబూరు దయాకర్ రెడ్డి




**ఖమ్మం సిటి, నవంబర్ 17, మహా:** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా చింతకాని మండలం రామకృష్ణాపురంలో కన్నెబోయిన నాగేశ్వరరావు గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. ముదిగొండ మండలం న్యాలక్ష్మీపురం, పమ్మి గ్రామాల్లో, బోనకల్ మండలం చిరునోముల, మధిర మండలం వంగవీడు, నిదానపురం గ్రామాల్లో, ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి, ఖమ్మం నగరంలోని ఎంబీ గార్డెన్స్ లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక మాస వనసమారాధన వేడుకలో పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలను నమ్మకండి

## జంగాలపల్లిలో 2 నెలల్లో 17 మంది మృత్యువాత

### మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్న డీఎంహెచ్ఓ



**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** ములుగు మండలం జంగాలపల్లిలో మృతిచెందినవారు ఆరోగ్య సమస్యలతోనే చనిపోయారని, ఎలాంటి దెయ్యాలు లేవని ఆఫీసర్లు స్పష్టం చేశారు. మూఢ నమ్మకాలతో కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజలను మూఢవిశ్వాసాలవైపు నెట్టొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎన్. గోపాల్ రావు తెలిపారు. జంగాలపల్లి గ్రామంలో దెయ్యం సంచరిస్తోందని, పదుల సంఖ్యలో జనం మృత్యువాతపడ్డారంటూ సోషల్ మీడియాలో వార్తలు రావడంతో జిల్లా ఆఫీసర్లు అలెర్ట్ అయ్యారు. దీనిపై స్పందిస్తూ గత రెండు నెలల్లో 17మంది వివిధ ఆరోగ్య కారణాలతో మాత్రమే చనిపోయారని, సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవాలు లేవని డీఎంహెచ్వో వివరణ ఇచ్చారు. మద్యానికి బానిసై ఒకరు, క్యాన్సర్, హార్ట్ స్ట్రోక్, కాలుకు ఇన్ఫెక్షన్, తీవ్ర జ్వరం.. ఇలా వివిధ ఆరోగ్య కారణాలతో తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతోనే వారు చనిపోయారే తప్ప ప్రచారాల్లో వాస్తవాలు లేవని గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి వెల్లడించారు. జంగాలపల్లి గ్రామంలో 3,098 మంది ప్రజలు ఉండగా రెండు నెలల క్రితం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు 8 బృందాలుగా ఏర్పడి ఫీవర్ సర్వే నిర్వహించి ఆరోగ్య సూచనలు చేసినట్లు ఈవో తెలిపారు. అయితే ఈ రెండు నెలల్లో మళ్లీ 17 మంది మృతిచెందగా ఆ వార్తలు ఊరికి ఏదో కీడు జరుగుతోందని ప్రచారం అవుతుండటంతో డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు సోమవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాయినిగూడెం పీహెచ్ సీ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది మెగా క్యాంపు నిర్వహించి ప్రతీ ఒక్కరి రిపోర్టులు తీసుకుంటామని తెలిపారు. అయితే జంగాలపల్లి గ్రామానికి చెందిన వారు మాత్రం గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు, గుడి నిర్మాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించి సరైన సమయంలో నిర్వహించడంలో ఆలస్యం అవడంవల్లనే ఇలా జరుగుతోందనే చర్చలు చేస్తున్నారు.

## 19న ప్రజాభిప్రాయ సేకరణ

### జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ

**ఖమ్మం, నవంబర్ 17, మహా:** ఈనెల 19న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమీషన్ పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నదని, ఉమ్మడి ఖమ్మం (భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలకు చెందిన మైనారిటీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్.జి.ఓ.లు ఇతర సంస్థలు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని జిల్లా ఇంచార్జ్ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె. సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విలువైన సలహాలు, సూచనలు, వినతులను ఆరు సెట్లు ధృవీకరణ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విఫలమైన పన్నాగం.. ఇద్దరు అరెస్ట్

## రియల్ ఎస్టేట్‌లో అప్పుల పాలు


### నక్సలైట్ల పేరుతో డబ్బు వసూళ్లకు పన్నాగం
### వాహన తనిఖీలలో పోలీసులకు చిక్కిన నిందితులు
### వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్





**ఖమ్మం, నవంబర్ 17, మహా:** రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అప్పుల పాలైన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా డబ్బులు సంపాదించి ఆ అప్పులు తీర్చేందుకు అడ్డదారిని ఎంచుకున్నారు. తుపాకులతో వ్యాపారులను బెదిరించి డబ్బులు తీసుకోవాలనుకునే వారి పన్నాగం కాస్త బెడిసి కొట్టింది. బీహార్ నుంచి పిస్టల్స్ తెప్పించుకున్న నిందితులు వారి ప్రణాళికను అమలు చేసే క్రమంలో ఖమ్మం పోలీసులకు చిక్కారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మహమ్మద్ అఫ్సర్ (50), గుండమల్ల వెంకటేశ్వర్లు( 50), ఖమ్మం కు చెందిన ఇద్దరు వ్యక్తులు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించారు. ఈ వ్యాపారంలో పెద్ద ఎత్తున అప్పులు కావడంతో అప్పులు తీర్చుకునేందుకు అడ్డదారిని ఎంచుకున్నారు. వీరిద్దరూ కొన్నాళ్ల క్రితం బిహార్‌లోని ఎండి రియాజ్ అనే వ్యక్తి ద్వారా మూడు పిస్టల్స్, నాలుగు మ్యాగ్జిన్లు, 17 బుల్లెట్లు తెప్పించుకున్నారు. అనంతరం నిందితులు ముదిగొండ ప్రాంతంలోని గ్రానైట్ వ్యాపారస్తులను నక్సలైట్లమంటూ బెదిరించి డబ్బు వసూలు చేయాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో శనివారం ఖమ్మం 3 టౌన్ పోలీసులు నగరంలో ప్రకాష్‌నగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానస్పదంగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్ వదిలి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వెంటాడి ఇద్దరు నిధులను పట్టుకున్నారు. పోలీసులకు వారి వద్ద నుంచి మూడు పిస్టల్స్, నాలుగు మాగ్జిన్లు, 17 బుల్లెట్లు, ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం అయ్యాయి. నిందితుల్లో మహమ్మద్ అఫ్సర్ (50) ఎలక్ట్రానిక్ గూడ్స్ , రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పేరు చెప్పు కుంటూ కస్బా బజార్లు నివాసం ఉంటున్నాడు. ఇతనిపై గతంలో గార్ల, మరిపెడ పోలీస్ స్టేషన్లలో ఎక్స్‌టార్షన్, బెదిరింపు, ఆయుధ చట్టాల కింద కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా మరో నిందితుడు గుండమల్ల వెంకటేశ్వర్లు అలియాస్ జీవీ (50) రియల్ ఎస్టేట్ వ్యాపారిగా చెప్పుకుంటూ ఖానాపురం హవేలీలో నివసిస్తున్నాడు. ఇతనిపై కూడా ఖమ్మం, గార్ల పోలీస్ స్టేషన్లలో పలు ఎక్స్‌టార్షన్ కేసులు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. అయితే వీరికి ఆయుధాలు సరఫరా చేసిన ప్రధాన నిందితుడు ఎండీ రియాజ్ పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు కొనసాగుతోందని కమిషనర్ తెలియజేశారు. నిందితుల నుంచి పోలీసులు 3 పిస్టల్స్, 4 మాగ్జిన్లు, 17 బుల్లెట్లు, ఒక మోటార్‌సైకిల్ ను స్వాధీనం చేసుకుని, వీరిపై 3 టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గ్రూప్-3 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 17, మహా:** కొత్తగూడెం ఎస్సార్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో గ్రూప్ 3 పరీక్షల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్ష కేంద్రాలకు అనుమతించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని ఆయన చెప్పారు. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## అక్రమ ఇసుక తరలింపును ఆపేదెవరు...?



**తాడ్వాయి, నవంబర్ 17, మహా:** మండలంలోని మేడారం జంపన్న వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక తరలింపులను అడ్డుకునేది ఎవరనే అంశం స్థానిక ప్రజల్లో చర్చగా మారింది. మేడారం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 8.5 కోట్ల రూపాయలతో రోడ్ల మరమ్మతుల పనులను శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఊరట్టం స్థూపం నుండి గ్రామం వరకు రెండు కోట్ల రూపాయలు నిధులతో నూతన సీసీ రోడ్డు, కన్నేపల్లి సారలమ్మ స్వాగత తోరణం నుండి సారలమ్మ గుడి వరకు రెండు కోట్ల రూపాయలతో నూతన సీసీ రోడ్లను నిర్మించడానికి ఇసుక కాంట్రాక్టర్ తరలిస్తున్నారు. గత పది రోజుల క్రితం ఇలాగే 500 క్యూసెక్ మీటర్లకు పైగా ఇసుకను తరలించగా అధికారులు కాంట్రాక్టర్లను మందలించి 1200 క్యూసెక్ మీటర్ల ఇసుకకు అనుమతులు ఇచ్చారు. అయినప్పటికీ ఇసుక ఎక్కడ నుండి తీయాలో గుర్తించక ముందే వాగు నుండి ఇష్టం వచ్చిన దగ్గర వారంతో పనిలేకుండా అధికారులు లేకున్నా సమయంలో ఎక్కువ మొత్తంలో ఇసుకను తరలిస్తున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంపన్న వాగు నుండి ఇసుక తరలింపు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహశీల్దార్ గిరిబాబును వివరణ అడగగా అనుమతులు ఉన్నప్పటికీ ఇసుక ఎక్కడి నుంచి తీయాలో కాంట్రాక్టర్లకు సూచించలేదని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా సూచించిన ప్రాంతం నుండి అనుమతి ఇచ్చిన వాహనాల్లో అధికారులు ఉన్నప్పుడు మాత్రమే తరలించాలని అన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దయాకర్ రెడ్డి



**ముదిగొండ, నవంబర్ 17, మహా:** మండల పరిధిలో పమ్మి గ్రామంలో ఆదివారం జరిగిన సురగాని గోపి, మంజుల వివాహానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తంబూరి దయాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన నూతన వధూవరులు గోపి, మంజులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు, మండల నాయకులు చిన్నపంగు రంజిత్, పంజాల రాజేష్, కందుల రంగారావు, బెజవాడ వంశీ, జూలకంటి సంజీవరెడ్డి, ఏలూరి హనుమంతరావు, దేవరపల్లి అనంతరెడ్డి, వధూవరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## బాలికను వేధిస్తున్న యువకునిపై కేసు నమోదు

**పాలకుర్తి, నవంబర్ 17, మహా:** మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి వేధిస్తున్న యువకుడిపై దేవరుప్పుల సీఐ మహేందర్ రెడ్డి కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. బాలిక తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు బాలికను వేధిస్తున్నాడని తెలియడంతో బోడబండ తండాకు చెందిన ధరావత్ యాకును అరెస్టు చేసి జిల్లా కోర్టు ముందు హాజరు పరచగా నిజానిజాలు తెలుసుకున్న కోర్టు అతనికి రిమాండ్ విధించింది. ఇకపై ఎవరైనా నేరాలకు పాల్పడినా, మహిళలను వేధించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## పాములేరులో విద్యార్థుల సందడి



**సత్తుపల్లి, నవంబర్ 17, మహా:** విశ్వశాంతి విద్యార్థులు విహారయాత్రలో భాగంగా సత్తుపల్లికి 60 కిలోమీటర్ల దూరంలో బూర్గంపాడు సమీపంలో గల విశాలమైన పాములేరులో ఖుషి, ఖుషిగా సందడి చేశారు. పాములేరుకు ప్రత్యేకత ఉంది. ఇరువైపులా చెట్లతో విశాలంగా ఉండడంతోపాటు వెడల్పైన ఆ ఏటిలో గోదావరి వైపు ప్రవహించే స్వచ్ఛమైన నీరు రెండు అడుగుల లోతు వరకు మాత్రమే ఉంటుంది. పాములేరు సురక్షితమైన, సుందర ప్రదేశం కావడంతో విద్యార్థులు నీరు, ఇసుక, చెట్ల చెంతన ఆట, పాటతో ఆనందోత్సవంతో రోజంతా సందడి చేశారు. నీళ్లలో వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం, కుప్పిగంతులు తదితర జలకాలాటలతో ఉత్సాహంగా గడిపారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఈ విహారయాత్ర ఎంతగానో మానసిక ఆనందాన్ని కలిగించిందని విశ్వశాంతి పాఠశాల యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుల్ల సత్యనారాయణ తెలిపారు. కుటుంబాలు, కుల, మతాలకతీతంగా జరిగే విహార యాత్రల వలన మానవ సంబంధాలు, స్నేహ ఆత్మీయ సంబంధాలు బలపడతాయని, మానసిక ఉత్తేజం కలుగుతుందని వారు పేర్కొన్నారు.

## అఘోరీతో సెల్ఫీ కోసం ఎగబడిన జనం

### మధిరలో పర్యటించిన మహిళా అఘోరీ

#### ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభ పూజా కార్యక్రమాలకు హాజరు



**మధిర, నవంబర్ 17, మహా:** ఇటీవల సోషల్ మీడియాలో పలుచోట్ల ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ కనబడుతున్న అఘోరీ ఆదివారం మధిరలో ప్రత్యక్షమైంది. పట్టణానికి చెందిన ప్రముఖ ఐ కేర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఐ కేర్ ఆస్పత్రి భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆమె హాజరైంది. ఈ సందర్భంగా ఆమె రాక మధిర పట్టణంలో పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఇదే ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారిరువురూ పలు ఆసక్తికర విషయాలను చర్చించుకున్నారు. అఘోరీ నగరలో సంచరించిన విషయం తెలుసుకున్న పలువురు ఆమెను చూసేందుకు ఉత్సాహం చూపించారు, ఆమెతో సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ చేశారు.



## విద్యుత్ షాక్ తో రైతు మృతి

**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** పంట పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లిన రైతు విద్యుత్ షాక్ కు గురై మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం సర్వాపూర్ గ్రామపంచాయతీ పరిధి జగ్గన్నగూడెం గ్రామానికి చెందిన కొట్టెం పెద్ద సమ్మయ్య (73) శనివారం తనకున్న ఎకరం పంట పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో షాక్ కు గురై మృతిచెందాడు. ఈ విషయం గమనించిన సమీప పొలంలో పనిచేస్తున్న పెనక నారాయణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమ్మయ్యకు భార్య రామక్క, కుమారుడు భరత్ ఉన్నారు. సమ్మయ్య కుమారుడు కొట్టెం భరత్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్సై వెంకటేశ్వర్ రావు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంటి సమ్మయ్య చనిపోవడంతో ఇంటికి పెద్దదిక్కును కోల్పోయారని, ఆయన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం ఏజెన్సీ నాయకుడు గుండెబోయిన రవిగౌడ్, దబ్బగట్ల శోభన్ ప్రభుత్వాన్ని కోరారు.

## పునర్నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం




**ఇల్లందు, నవంబర్ 17, మహా:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని 24 ఏరియాలో గల కమ్యూనిటీ హాల్ ను ఏసీగా పునర్నిర్మించి ఆదివారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హాల్ సింగరేణి వ్యాప్తంగా నిర్మించిన మొట్ట మొదటి కమ్యూనిటీ హాల్ అని, ఇందులో ఉద్యోగులు, పట్టణ ప్రజలు అనేక రకాల శుభకార్యాలు నిర్వహించుకుంటూ రద్దీగా ఉంటుందన్నారు. తాను నిర్వహించే తనిఖీలో భాగంగా ఒక రోజు ఈ కమ్యూనిటీ హాల్ ను తనిఖీ చేయడం జరిగిందని, అప్పుడు ఇంతటి చరిత్ర కల్గిన ఈ కమ్యూనిటీ హాల్ అరకొర సౌకర్యాలతో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ కమ్యూనిటీ హాల్ ను ఏసీ హాల్ గా నిర్మించి పూర్వపువైభవం తీసుకోని రావాలని అనుకున్నట్లు, అంతే కాకుండా అదనంగా పెళ్లి కొడుకు, పెళ్లి కూతురుల కోసం రెండు విడిది గదులు, వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు, యూనియన్ నాయకులతో మాట్లాడడం జరిగి పనులను ప్రారంభించడం మధ్య మధ్యలో ఇక్కడ నిర్వహిస్తున్న పనులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. కమ్యూనిటీ ఏసీ హాల్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఏరియా జీఎంను ఏరియా అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, డీజీఎం (సివిల్) రవి కుమార్, అధికారులు మధుబాబు, దిలీప్ కుమార్, సాయి స్వరూప్, గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య, ప్రతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉద్యోగులు పాల్గొన్నారు.



## రైతుపై ఎలుగుబంటి దాడి

**పాలకుర్తి, నవంబర్ 17, మహా:** పాలకుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామ శివారు రేగులగడ్డకు చెందిన రైతు ముస్కు నారాయణ ఆదివారం తెల్లవారుజామున తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న సమయంలో ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేయటంతో తలపై భాగంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న నారాయణను వెంటనే వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎలుగుబంటి చుట్టుపక్క గ్రామాల పరిసరాలలో గత కొద్ది రోజులుగా తిరుగుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు నిఘా పెట్టి ఎలుగుబంటిని బంధించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర



**కల్లూరు, మహా:** కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం నందు పోట్రు కిరణ్ స్వామి, కాటేపల్లి రజినీకాంత్ స్వామి తదితరుల ఇరుముడి కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అయ్యప్ప స్వాముల ఇరుముడి యాత్ర శుభప్రదంగా జరగాలని కాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సండ్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ స్వామి, అయ్యప్ప స్వామి మాలధారులు మోటమర్రి వేణు స్వామి, సిటీ కేబుల్ సాగర్ స్వామి, గౌరవరపు కిషోర్ స్వామి, డి. సురేష్ స్వామి కల్లూరు, తల్లాడ మండల నాయకులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల కృష్ణ, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ కమ్లి, నాయకులు రాచమళ్ళ నాగేశ్వర రావు, కొరకొప్పు ప్రసాద్, భానోత్ కృష్ణ, మాజీ ఏఎంసి డైరెక్టర్ కట్టా ఆర్లప్ప, సోషల్ మీడియా ప్రతినిధి సిహెచ్ కిరణ్, మాజీ వార్డు సభ్యులు దార్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ములుగు విద్యార్థులు

### అభినందించిన డీఈవో పాణిని




**ములుగు, నవంబర్ 17, మహా:** హర్యానాలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ కు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం జడ్పీ హై స్కూల్ విద్యార్థులు తరలివెళ్లారు. 51వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శిని (ఆర్బీవీపీ) సైన్స్ ఫెయిర్ 2024 లో పాల్గొననున్నట్లు డీఈవో జి. పాణిని తెలిపారు. బయోసైన్స్ ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ రెడ్డి పర్యవేక్షణలో రక్షిత, మైథిలి విద్యార్థులతో తయారుచేయబడిన ఇంటెలిజెంట్ ఆల్కహాల్ డిటెక్షన్ వెహికల్ అలర్ట్ సిస్టం ఫర్ డ్రైవర్స్ అనే ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపిక కాబడిందని వెల్లడించారు. విద్యార్థులను ప్రోత్సహించినందుకు ప్రధానోపాధ్యాయుడితోపాటు గైడ్ టీచర్లను డీఈవో అభినందించారు. జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

ANN తెలుగు

# మహా పత్రిక

07

సోమవారం, హైదరాబాద్ | 18-11-2024 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM

## మిల్లెట్‌లోకి రామోజీ గ్రూపు




**హైదరాబాద్, మహా :** రామోజీ గ్రూపు తాజాగా మిల్లెట్ల విభాగంలోకి అడుగుపెట్టింది. సబల పేరుతో వీటిని విక్రయించనున్నది. ఈ సందర్భంగా సబల మిల్లెట్ల డైరెక్టర్ సహరి చెరుకూరి మాట్లాడుతూ.. ప్రస్తుతం 45 ఉత్పత్తులను విడుదల చేసినట్లు, వచ్చే మూడు నెలల్లో మరో 55 ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రియ బ్రాండ్‌తో వీటిని ప్రత్యేకంగా విక్రయిస్తున్నట్లు, కస్టమర్లకు నాణ్యమైన మిల్లెట్లను అందించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, ముఖ్యంగా స్థానికంగా ఉండే రైతుల నుంచి సేకరించిన ఉత్పత్తులను కొనుగోలుదారులకు అందిస్తున్నట్లు చెప్పా రు. వీటిలో రెడీటుఈట్ స్నాక్స్, చిరుధాన్యాలతో బ్రేక్‌ఫాస్ట్, ఇన్‌స్టంట్ మిక్స్ ఉత్పత్తులున్నాయని, ఇవి రూ.75 మొదలుకొని రూ.150 లోపు లభించనున్నాయి. ప్రస్తుతానికి కంపెనీ వెబ్‌సైట్, ఈకామర్స్‌లో మాత్రమే లభించనుండగా, భవిష్యత్తులో రిటైల్ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె ప్రకటించారు. వీటిని విజయవాడలో ఇప్పటికే ఉన్న ప్లాంట్లో ఉత్పత్తి చేస్తుండగా, హైదరాబాద్‌లో ఆర్అండ్‌డీని నెలకొల్పినట్లు చెప్పారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై గుత్తాధిపత్యానికి కుట్ర ..

### మైక్రోసాఫ్ట్.. ఓపెన్ ఏఐలపై ఎలన్ మస్క్ దావా..!



చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐపై టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ న్యాయపోరాటం తీవ్రతరం చేశారు. ఈ న్యాయ పోరాటంలో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తోపాటు వెంచర్ క్యాపిటలిస్ట్, లింక్డ్‌ఇన్ కో ఫౌండర్ రైడ్ హాఫ్ మన్ లను ప్రతివాదులుగా చేర్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మార్కెట్లో గుత్తాధిపత్యం కోసం మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ ప్రయత్నిస్తున్నాయని పేర్కొంటూ ఈ నెల 14న నార్త్‌ర్న్ కరోలినా ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓపెన్ ఏఐ మాజీ బోర్డ్ మెంబర్ – ప్రస్తుతం న్యూరాలింక్ ఎగ్జిక్యూటివ్ శివాన్ జిలిస్ తో కలిసి ఎలన్ మస్క్ పిటిషన్ వేశారు. శివాన్ జిలిస్ సైతం తాను ఓపెన్ ఏఐ బోర్డు మెంబర్ గా ఉన్నప్పుడు సంస్థ యాజమాన్యం మార్గ నిర్దేశంపై ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత నాన్ ప్రాఫిట్ మిషన్ లక్ష్యంతో ఓపెన్ ఏఐ ప్రారంభమైంది. కానీ మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో ఓపెన్ ఏఐ ప్రారంభ లక్ష్యాల నుంచి తప్పుకుని వాణిజ్య ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నదని ఎలన్ మస్క్ ఆరోపించారు. ప్రత్యర్థి ఏఐ సంస్థలకు నిధులు లభించకుండా, సున్నితమైన సమాచారం షేర్ చేయకుండా నిరోధించడంతోపాటు ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్ గుత్తాధిపత్యం ప్రదర్శిస్తున్నాయని మస్క్ అభియోగం. లింక్డ్‌ఇన్ కో ఫౌండర్ రైడ్ హాఫ్ మన్, మైక్రోసాఫ్ట్ యాజమాన్యం కలిసి రెండు కంపెనీల్లో ద్వంద్వ భాగస్వామ్యాన్ని నిరోధించాలని ఎలన్ మస్క్ తన పిటిషన్ లో కోరారు.

గత మార్చిలో శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ కోర్టులో ఓపెన్ ఏఐకి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసిన ఎలన్ మస్క్.. ఎటువంటి వివరణ ఇవ్వకుండానే ఉపసంహరించుకున్నారు. తాజాగా ఫెడరల్ చట్టాలను ఓపెన్ ఏఐ ఉల్లంఘిస్తున్నదంటూ, తనను డీఫ్రాడ్ చేయడానికి కుట్ర చేస్తున్నదంటూ ఫెడరల్ కోర్టులో కొత్తగా దావా వేశారు. దీనిపై ఓపెన్ ఏఐ గానీ, హాఫ్ మన్ గానీ స్పందించలేదు. మైక్రోసాఫ్ట్ స్పందించేందుకు నిరాకరించింది.


## కార్ల విక్రయాల్లో మారుతి టాప్

### అత్యధికంగా అమ్ముడైన బ్రాండ్లలో ఆరు కంపెనీయే

**న్యూఢిల్లీ, మహా:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ దూసుకుపోతున్నది. గత నెలలో దేశీయంగా అమ్ముడైన టాప్10 వాహనాల్లో ఆరు బ్రాండ్లు మారుతికి చెందినవే కావడం విశేషం. గత కొన్ని నెలలుగా అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు గత పండుగ సీజన్ కిక్కునిచ్చింది. నిర్వహణ ఖర్చులు పెరిగినాయంటూ ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచుతుండటంతో కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ గత నెలలో అమ్ముడైన మొత్తం వాహనాల్లో మారుతికి చెందిన వాహనాలకు పెద్దపీట వేశారు. అలాగే హ్యుందాయ్, మహీంద్రా, టాటాలకు చెందిన బ్రాండ్లకు కూడా మద్దతు లభించింది.




## రెడ్‌మీ నుంచి మరో బడ్జెట్ ఫోన్ రెడ్‌మీ ఏ4 5జీ.. 20న మార్కెట్లో ఆవిష్కరణ..!




ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ షియోమీ అనుబంధ రెడ్‌మీ తన రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్‌ను ఈ నెల 20న ఆవిష్కరించనున్నది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 4ఎస్ జెన్ 2 మొబైల్ ఎస్వోసీ ప్రాసెసర్ తో వస్తున్న ఈ ఫోన్ ధర రూ.10 వేల లోపు ఉండనున్నది. గత నెలలో జరిగిన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) ఈవెంట్‌లో రెడ్‌మీ తన రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్‌ను ఆవిష్కరించింది. తన రెడ్‌మీ ఏ4 5జీ (Redmi A4 5G) ఫోన్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 4ఎస్ జెన్ 2 మొబైల్ ప్రాసెసర్ తో పని చేస్తుంది. ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతోపాటు 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. 50మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది. 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు మద్దతుతో 6.88 అంగుళాల డిస్ ప్లే ఉంటుంది. ఇక సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8మెగా పిక్సెల్ కెమెరా ఉంటది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఓఎస్ బేస్డ్ హైపర్ ఓఎస్ స్కిన్ వర్షన్ మీద పని చేస్తుంది. సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్, యూఎస్బీ టైప్ సీ చార్జింగ్ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. శాండ్ విచ్ డిజైన్, డ్యుయల్ టోన్ గ్లాస్ ఫినిష్‌తో వస్తోంది. భారత్ మార్కెట్లో రెడ్‌మీ ఏ4 5జీ ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.10 వేల లోపు ధరకే లభిస్తుందని షియోమీ ధృవీకరించింది. బ్యాంకు, లాంచింగ్ ఆఫర్లతో కలిసి ఫోన్ రూ.8,499లకే లభిస్తుందని తెలుస్తోంది.

## సేవల విస్తరణ దిశగా జొమాటో..

### డిస్ట్రిక్ట్ అనే కొత్త యాప్ ప్రారంభం..!




**మహా, బిజినెస్:** ప్రముఖ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటో కొత్త సేవలు ప్రారంభించింది. ఇప్పటికే క్విక్ కామర్స్ (రంగంలో దూసుకెళ్తున్న జొమాటో .. తన సేవల విస్తరణకు సిద్ధమైంది. తాజాగా డిస్ట్రిక్ట్ అనే పేరుతో కొత్త యాప్ ప్రారంభించింది. దీంతో టికెట్ బుకింగ్, డైనింగ్ సహా పలు రకాల సేవలను యూజర్లకు అందుబాటులోకి వస్తాయి. జొమాటో తచ్చిన తాజా డిస్ట్రిక్ట్ యాప్‌లో సినిమా టికెట్ల బుకింగ్, ఈవెంట్ల టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్పోర్ట్స్ టికెటింగ్, లైవ్ షోలు, షాపింగ్, డైనింగ్ సేవలు కూడా ఈ యాప్‌లో జత చేసింది. గత ఆగస్టులో ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ పేటీఎం నుంచి రూ.2,048 కోట్లకు టికెటింగ్ బిజినెస్‌ను కొనుగోలు చేసిన జొమాటో.. తాజాగా కొత్త సేవలకు తన వ్యాపార విస్తరణకు శ్రీకారం చుట్టింది.

# దేశం-విదేశం NATIONAL NEWS

## అంబులెన్స్‌కు దారివ్వని కారు యజమాని..

### రూ.2.5లక్షలు జరిమానా విధించిన పోలీసులు..






**మహా:** వాహనదారుడికి పోలీసులు షాక్ ఇచ్చారు. ఏకంగా రూ.2.5లక్షల జరిమానా విధించడంతో పాటు సదరు వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్‌ని సైతం రద్దు చేశారు. అంబులెన్స్‌కు ఉన్న పేషెంట్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా.. వాహనం యజమాని దారి ఇవ్వకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. సాధారణంగా వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఎవరైనా హారన్ ఇచ్చిన సందర్భంలో దారి ఇస్తుంటారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు వచ్చిన సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనైనా దారి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, ఓ ప్రబుద్ధుడు మాత్రం అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా డ్రైవర్‌ని ఇబ్బందులకు గురి చేశాడు. ఈ ఘటన కేరళలో చోటు చేసుకున్నది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఎదురుగా వెళ్తున్న కారును దాటి అంబులెన్స్ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏమాత్రం సైడ్ ఇవ్వలేదు. అంబులెన్స్ సైరన్ మోగుతున్నా.. వాహనం హారన్ ఇస్తున్నా కారు యజమాని ఏదేమీ పట్టించుకోలేదు. అయితే, అంబులెన్స్‌లోనే ఉన్న మరో వ్యక్తి కారు యజమాని ప్రవర్తనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో తెగ వైరల్ అయ్యింది. ఈ క్రమంలో కేరళ పోలీసులు స్పందించారు. సదరు కారు యజమాని ఇంటికి వెళ్లి రూ.2.5లక్షల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ని సైతం రద్దు చేసినట్లు తెలుస్తున్నది. కారు యజమాని తీరుపై పలువురు యూజర్లు విమర్శలు గుప్పించారు. రోడ్డు భద్రతా నియమాలు, చట్టాల్లో భాగంగా అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం ఓ ముఖ్యమైన అంశమని, దానికి దారి ఇవ్వని వారు శిక్షార్హులని నిర్ధారించగలరా? అంటూ ఓ యూజర్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ట్యాగ్ చేశారు. కారు యజమాని ప్రవర్తన సిగ్గుచేటని ఒకరు.. కొందరిలో కనీస స్పృహ లేకుండాపోతుందని మరో యూజర్ పేర్కొన్నారు.

## భారత్ అరుదైన ఘనత..

### హైపర్ సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

హైపర్ సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి డీఆర్‌డీవో ఈ క్షిపణిని ఆదివారం ఉదయం విజయవంతంగా పరీక్షించింది. ఇది 1500 కిలోమీటర్లకు మించిన వివిధ పే లోడ్లను సునాయాసంగా లక్ష్యానికి తీసుకెళ్లగలదు. ఈ విషయాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు.దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించడంతో భారత్ ఓ పెద్ద మైలు రాయిని దాటిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంతో అత్యాధునిక మిలటరీ టెక్నాలజీని సాధించిన అతి కొద్ది దేశబూల జాబితాలో భారత్ కూడా చేరినట్లయ్యిందని వెల్లడించారు. ఈ మేరకు హైపర్ సోనిక్ క్షిపణి పరీక్షకు సంబంధించిన వీడియోను తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో పోస్టు చేశారు.






## ఘన వ్యర్థాల నిర్వహణకు 2016 నిబంధనలు అమలు చేయాల్సిందే: సుప్రీంకోర్టు

దేశ రాజధాని ఢిల్లీలో ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్2016 అమలులో ప్రభుత్వ ఏజెన్సీలన్నీ విఫలమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేక్ హోల్డర్లందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై చర్చించాలని సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలో 2016 నాటి నిబంధనలు సక్రమంగా అమలు చేయడం కీలకమని చెప్పింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ నెల 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అధికారులంతా సమస్య పరిష్కారంపై ఏకతాటిపైకి రాలేదని.. 2016 నాటి ఆదేశాల అమలుకు సంబంధించి గడువును చెప్పకపోతే.. తామే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా కోర్టుకు నివేదిక సమర్పించాలని స్టేక్ హోల్డర్లను కోర్టు ఆదేశించింది. సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను చెప్పేందుకు డిసెంబర్ 13 వరకు గడువు విధించింది. ఇతర కేసుల్లో మాదిరిగానే నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొంది. ఢిల్లీఎన్‌సీఆర్‌లో నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే దేశంలోని ఇతర నగరాల్లో ఏం జరుగుతుందో ఊహించవచ్చని చెప్పింది. ఈ అంశంపై విచారణను డిసెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యంపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్నది. ఈ సందర్భంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ అంశం ప్రస్తావనకు వచ్చింది. 2026 నాటికి దేశ రాజధానిలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 11,000 టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని మించిపోతుందని ఢిల్లీ ఎండీసీ అక్టోబర్ 18న సుప్రీంకోర్టుకు తెలిపింది. జూలై 26న దేశ రాజధానిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను సరిగ్గా అమలు చేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో ప్రతిరోజూ 3వేల టన్నులకు పైగా ఘన వ్యర్థాలు శుద్ధి కాకుండా మిగిలిపోతున్నాయని.. ఇది ప్రజారోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతుందని పేర్కొంది. దేశ రాజధానిలో రోజుకు 11,000 టన్నులకు పైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, ప్రాసెసింగ్ ప్లాంట్ల రోజువారీ సామర్థ్యం 8,073 టన్నులు ఉందంటూ సుప్రీం కోర్టు ఎండీని మందలించింది.

## శరద్ పవార్ బ్యాగులు తనిఖీ చేసిన ఎన్నికల అధికారులు



**మహా, ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళిని అధికారులు అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ బ్యాగులను, ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం పూణె జిల్లాలోని బారామతి హెలిప్యాడ్ వద్ద ఈ సంఘటన జరిగింది. షోలాపూర్‌లో ఎన్నికల ర్యాలీకి హాజరయ్యేందుకు హెలికాప్టర్‌లో శరద్ పవార్ ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆ హెలికాప్టర్‌తోపాటు ఆయన బ్యాగులను ఎన్నికల అధికారులు చెక్ చేశారు.

## గిల్‌కు గాయం



**పెర్త్:** ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీకి ముందు భారత్‌కు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ ఎదుర్కొన్న టీమ్‌ఇండియా ప్లేయర్ల గాయాలు కలవరపెడుతున్నాయి. ఇప్పటికే కేఎల్ రాహుల్ గాయపడగా, తాజాగా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ఎడమచేతి వేలుకు గాయమైంది. ఇంట్రా మ్యాచ్‌లో భాగంగా శనివారం ఫీల్డింగ్ చేస్తుండగా గిల్ గాయపడ్డాడు. ఈనెల 22 నుంచి మొదలయ్యే తొలి టెస్టుకు గిల్ అందుబాటులో ఉండే అవకాశం లేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

## సెమీస్‌కు భారత్



**రాజ్‌గిర్:** మహిళల ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 30 తేడాతో చైనాపై అద్భుత విజయం సాధించింది. టీమ్‌ఇండియా తరఫున సంగితా కుమారి(32ని), కెప్టెన్ సలీమా టెటె(37ని), దీపిక(60ని) గోల్స్ చేశారు. తమ(9) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న చైనా(6)పై భారత్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. వరుసగా నాలుగో విజయంతో భారత్ ప్రస్తుతం 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, చైనా(6) రెండో స్థానంలో ఉంది. ఆదివారం జరిగే సెమీస్‌లో భారత్..జపాన్‌తో తలపడుతుంది.



## బ్యాడ్మింటన్ చాంప్ శ్రావ్య

**మహా, హైదరాబాద్ :** మేడ్చల్‌మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీలో శ్రావ్య విజేతగా నిలిచింది. శనివారం జరిగిన బాలికల అండర్11 ఫైనల్లో శ్రావ్య టైటిల్ సొంతం చేసుకోగా, అండర్13లో ఆరాధ్య, మనస్వీ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. బాలుర అండర్13 డబుల్స్‌లో విదిత్‌రెడ్డి, రవికిషోర్ జోడీ 2114, 2115తో కార్తికేయ, శివాంశు ద్వయంపై గెలిచారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి జాతీయ మాజీ చీఫ్ కోచ్ భాస్కర్ బాబు అతిథిగా హాజరయ్యారు.

## హైదరాబాద్, ఆంధ్ర పోరు డ్రా



**మహా, హైదరాబాద్ :** హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య స్థానిక ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా జరిగిన రంజీ గ్రూపుబీ పోరు డ్రా గా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్ 51 ఓవర్లలో వికెట్ నష్టానికి 193 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(95) మరోమారు తనదైన శైలిలో ఆకట్టుకున్నాడు. అభిరాత్‌రెడ్డి(70 నాటౌట్) అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. రఫీ(1/35)కి ఏకైక వికెట్ దక్కింది. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 448/9తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్ర ఒక్క పరుగు జతచేయకుండానే ఆలౌటైంది. అనికేత్‌రెడ్డి(4/137), రక్షణ్‌రెడ్డి(3/75) ఆకట్టుకున్నారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆంధ్రకు 3 పాయింట్లు దక్కగా, హైదరాబాద్ ఒక పాయింట్‌కు పరిమితమైంది. హైదరాబాద్ 9పాయింట్లతో 6వ స్థానంలో ఉన్నది.

వర్త్ వర్మ వర్త్..ఈ ఫేమస్ డైలాగ్ గుర్తుండే ఉంటుంది. సూపర్‌స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమా ద్వారా పాపులర్ అయిన ఈ డైలాగ్ మన హైదరాబాదీ తిలక్‌వర్మకు అతికినట్లు సరిపోతుంది. దక్షిణాఫ్రికాతో శుక్రవారం నాలుగో టీ20లో తిలక్ సునామీ సెంచరీ చూసిన ప్రతి ఒక్కరికి మనసులో అనిపించే ఉంటుంది. వాండరర్స్‌లో ప్రకంపనలు సృష్టిస్తూ సఫారీలను వర్మ ఓ ఆటాడుకున్నాడు. బౌండరీలు చిన్నబోయేలా ఫోర్లు, సిక్స్‌లు బాదుతూ బౌలర్లను చేష్టలుడిగేలా చేశాడు. పట్టుమని 20 మ్యాచ్‌లాడిన ఈ నూనుగు మీసాల కుర్రాడు..దక్షిణాఫ్రికాపై ప్రకంపనలు సృష్టించాడు. బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో తన విలువేంటో ఘనంగా చాటిచెప్పాడు. గాయాలకు తోడు ఫామ్‌లేమితో జట్టులోకి వస్తూ పోయిన తిలక్..భారత భవిష్యత్ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు.

## వర్త్ వర్మ వర్త్!

నంబూరి ఠాకూర్ తిలక్‌వర్మ..అలియాస్ వర్మ. భారత క్రికెట్‌లో మారుమోగుతున్న పేరు. క్రికెట్ దిగ్గజాలు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత వారి స్థానాలు ఎవరు భర్తీ చేస్తారో అన్న ప్రశ్నలకు ఫుల్‌స్టాప్ పెడుతూ తాను ఉన్నానంటూ జెండా పాతాడు తిలక్. దక్షిణాఫ్రికా పర్యటన రూపంలో టీమ్‌ఇండియాకు తిలక్ రూపంలో అసలు సిసలైన టీ20 ఆణిముత్యం దొరికింది. సంప్రదాయక క్రికెట్ షాట్లకు కామ పెడుతూ ట్రేడ్‌మార్క్ షాట్లతో ఈ హైదరాబాదీ..సఫారీలపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ తీరు ఫ్యాన్స్‌ను కట్టిపడేసింది. ఇన్ని రోజులు క్లాసిక్ షాట్లకు కట్టుబడ్డ వర్మ..తనలో కొత్త కోణాన్ని పరిచయం చేశాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన 22 ఏండ్ల తిలక్..దక్షిణాఫ్రికాతో సిరీస్ ద్వారా అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. పేస్‌కు స్వర్గధామమైన సఫారీ పిచ్‌లపై తన విధ్వంసక బ్యాటింగ్‌తో కెరీర్‌కు మెండైన పునాది వేసుకున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అంతగా ఆకట్టుకోలేకపోయిన వర్మ..ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో విశ్వరూపమే చూపాడు. మూడో టీ20లో ప్రమోషన్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఈ కుర్రాడు చాలా పరిణతి కనబరిచాడు. ఓవైపు ఇన్నింగ్స్‌లో దూకుడు తగ్గకుండా పరుగుల జోరు కొనసాగిస్తూ భారీ స్కోరు అందించాడు. శుక్రవారం నాటి మ్యాచ్‌లోనూ అదే రిపీట్ చేస్తూ తిలక్ ఆడిన ఆట విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మద్దతుతో కీలకమైన మూడో నంబర్‌లో వచ్చిన తిలక్ తన ప్రమోషన్‌కు సార్థకత చేకూర్చాడు.

### మూడుకు న్యాయం

కీలకమైన మూడో స్థానానికి తిలక్ సరైన న్యా యం చేశాడు. తొలి రెండు టీ20 ల్లో నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటి ంగ్‌కు వచ్చిన తిలక్.. మూడు, నాలుగు మ్యాచ్‌ల్లో ప్రమోషన్ దక్కించుకున్నాడు. ఇన్ని రోజులు కోహ్లీ లాంటి దిగ్గజం ఆడిన స్థానం లో వచ్చిన తిలక్ ఆశాకిరణంలా కనిపించాడని మ్యాచ్ ముగిసిన తర్వాత సూర్యకుమార్ ప్రశంసలతో ముంచెత్తాడు. **టీ 20ల్లో తిలక్ మ్యా:** 20 ప: 616 అ.స్కో: 120* స: 51.33 సె: 2, అ.సె: 2..


**నోట్:** మ్యా: మ్యాచ్‌లు, ప: పరుగులు, స: సగటు, సె: సెంచరీలు, అ.సె: అర్ధసెంచరీలు

## జూనియర్ 360..

ఇన్నాళ్లు క్లాసిక్ షాట్లు ఆడుతూ పరుగులు సాధించిన తిలక్..తన ఆటతీరుకు మరింత మెరుగులు అద్దుకున్నాడు. క్రికెట్‌లో ఓనమాలు నేర్పించిన సలామ్ బాయిష్ శిక్షణలో మరింత రాటుదేలాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ముందు హైదరాబాద్‌లో తన కొత్త షాట్లకు మరింత పదునుపెట్టుకున్నాడు. సిమెంట్ పిచ్‌పై బుల్లెట్‌లా దూసుకొచ్చే బంతులను అంతే వేగంతో కొడుతూ ప్రాక్టీస్ చేయడం కలిసొచ్చింది. దీనికి తోడు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సహచరుడు సూర్యకుమార్ ఆటతీరును దగ్గరుండి పరిశీలించిన తిలక్ అదే శైలిలో నెట్స్‌లో ప్రాక్టీస్ చేసి ఫలితం రాబట్టాడు.ఇదంతా ఎందుకు చెప్పకోవాల్సి వస్తుందంటే నాలుగో టీ20లో అభిషేక్ ఔట్ కాగానే క్రీజులోకి వచ్చిన తిలక్‌ను కట్టడి చేసేందుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌ను కెప్టెన్ మార్క్రమ్ దింపాడు. ఐపీఎల్ తరహాలో ఇబ్బంది పడుతాడనుకున్న తిలక్.. మార్క్రమ్ ఎత్తులను చిత్తుచేస్తూ మహారాజ్‌ను గట్టిగా అరుసుకున్నాడు. మరోవైపు పేసర్లను అదే స్థాయిలో దంచికొట్టడం తిలక్ ఆటశైలిలో మార్పును తెలుపుతున్నది. ఔట్ సైడ్ ఆఫ్‌స్టంప్ బంతులు వేసిన సింపాలకు తిలక్ అదే శిక్ష వేశాడు. బంతి ఎక్కడ పడ్డా తన ఫుట్‌వర్క్‌ను అంతే వేగంగా మార్చుకుంటూ బంతులను స్టాండ్స్‌లోకి మార్చిన తీరు నభూతో నభవిష్యత్ అనిపించింది.



# సినిమా వార్తలు MOVIE NEWS



## మహారాష్ట్రలో తెలుసు కదా మూవీ షూటింగ్

సినిమా, మహా: స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ తన అప్ కమింగ్ మూవీ 'తెలుసు కదా' లో కంప్లీట్ న్యూ అండ్ స్టైలిష్ బెస్ట్ అవతార్‌లో కనిపించనున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ మూవీతో డైరెక్టర్ గా డెబ్యు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుంది. తాజాగా మేకర్స్ మహారాష్ట్రలో 24 రోజుల లాంగ్ షెడ్యూల్ ప్రారంభించారు. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టిపై చిత్రీకరిస్తున్న సాంగ్ తో ఈ షెడ్యూల్ మొదలైయింది. ఈ షెడ్యూల్ లో సాంగ్ తో పాటు క్రూషియల్ టాకీ పార్ట్ ని షూట్ చేయనున్నారు. లీడ్ యాక్టర్స్ తో పాటు సినిమాలోని కీలక నటీనటులు కూడా పాల్గొంటున్నారు. హై బడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సెన్సేషనల్ కంపోజర్ థమన్ ఎస్ మ్యూజిక్ అందిస్తున్నారు. జ్ఞాన శేఖర్ బాబా డీవోపీ కాగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొఫెషనల్ నవీన్ నూలి ఎడిటింగ్ హ్యాండిల్ చేస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైనర్ గా చేస్తున్నారు.

## ఎవడ్రా వాడు.. డబ్బంటే లెక్కలేదు..

### పుష్ప 2 ది రూల్ ట్రైలర్



**మహా, సినిమా:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ట్రైలర్ రానే వచ్చింది. పాట్నాలోని గాంధీ మైదాన్ పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఎవడ్రా వాడు.. డబ్బంటే లెక్కలేదు.. పవర్ అంటే భయం లేదు.. జగపతి బాబు వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్. పుష్ప.. పేరు చిన్నది.. కానీ సౌండ్ మాత్రం చాలా పెద్దది.. పుష్ప అంటే పేరు కారు.. బ్రాండ్.. సాగుతున్న సంభాషణలు సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## పరిపూర్ణ హాస్యరస చిత్రం

**సినిమా, మహా:** మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న మూవీ 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ హీరోయిన్ గా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న 3వ చిత్రం ఇది. డిసెంబర్ 20న సినిమా విడుదల కానున్నది. నవంబర్ 21, ఉదయం 11.12 గంటలకు టీజర్ విడుదల చేయనున్నట్లు ఇటీవల వెల్లడించారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... 'సినిమా ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో పరిచయం చేస్తాం. సినిమా చిత్రీకరణ సెప్టెంబర్ మొదటి వారంలో పూర్తి చేశాం. డబ్బింగ్ కార్యక్రమాలు సైతం పూర్తి అయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం రీ రికార్డింగ్ పనులు జరుగుతున్నాయి. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? లేదా చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. ఇంటిల్లిపాది చూసి నవ్వుకునే వినోదాత్మక సినిమా. మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఏడాది ఆఖరులో అందరినీ నవ్విస్తుందీ సినిమా' అని ఆయన అన్నారు.



## ఆ స్టార్ హీరో వేధిస్తున్నాడు

### ..పూనమ్ కౌర్ సంచలన పోస్ట్

మహా-: వివాదాస్పదమైన హాట్ టాపిక్‌తో ఎపుడూ వార్తల్లో నిలిచే పూనమ్ కౌర్ ఈ సారి ఓ టాలీవుడ్ హీరోపై దారుణమైన ఆరోపణలు చేశారు. తాజాగా ఆమె ట్విట్టర్ లో పోస్ట్ చేస్తూ.. " నేను తెలుగులో చేసిన ఒక సోషియో ఫాంటసీ చిత్రంలో నాతో పాటు ఒక అమ్మాయి నటించింది. తర్వాత ఆమె హీరోయిన్ గా కొన్ని రోల్స్ చేసింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆమె సినిమాలు చేయడం ఆపేసింది. అలాగే ఎవరికీ కనిపించకుండా పోయింది. తాజాగా నాకు ఒక డొమెస్టిక్ ఫ్లైట్‌లో కనిపించింది. ఆమె నాతో పెళ్ళికి షాపింగ్ కి వచ్చినట్లు, తాను ఈ దేశంలో ఉన్నట్లు ఎవరికీ చెప్పొదంటూ రిక్వెస్ట్ చేసింది. ఏమైందని నేను అడగగా ఆమె సమాధానమిస్తూ.. 'ఒక సూపర్ స్టార్ డమ్ కలిగిన హీరో నన్ను వేధిస్తున్నాడు.. నేను ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చి ఫాలో అవుతున్నాడు. మేము సినిమాలో ఇంటిమేటెడ్ సీన్ చేసినప్పుడు ఆయన నా మొహంపై నిజంగానే భారీ మొత్తంలో ఉమ్మి వేశాడు. డైరెక్టర్ కట్ కూడా చెప్పలేదు' అంటూ చెప్పింది. అలాగే తర్వాత ఆమె ఇండస్ట్రీ వదిలి అమెరికాలో చదువుకోవడానికి వెళ్ళింది. కానీ.. ఆ హీరో వేదింపులు ఇంకా తగ్గలేదని చెప్పింది. ఇదేమి కట్టు కథ కాదు. ఆ అమ్మాయిని నేను హగ్ చేసుకొని ఓదార్చాను" అంటూ రాసుకొచ్చింది. దీంతో ఎవరు ఆ హీరో, హీరోయిన్ అంటూ ఆరా తీస్తున్నారు. ఇక ఈ పోస్ట్‌లో ఆమె పైన తమిళనాడు అని మెన్షన్ చేసి క్రింద మాత్రం తెలుగు సినిమా అని మెన్షన్ చేయడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.